
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 39.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
శుక్రవారం 4 ఏప్రిల్ 2025



గాలివాన బీభత్సం



రామ్‌నగర్ ఫ్లై ఓవర్ వద్ద మురుగునీటిలో మునిగిన వాహనాలు

● కూలిన గోడలు.. విరిగిన చెట్లు ● విద్యుత్ సరఫరాకు అంతరాయం ● రోడ్లను ముంచెత్తిన మురుగునీరు ●పిడుగుపాటుకు మహిళ మృతి

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. వర్షం పెద్దగా కురవకపోయినా, ఉరుములు మెరుపులు హడలెత్తించాయి. పిడుగుపాటుకు గుంతకల్లు మండలంలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయారు. చెట్లు విరిగి పడి విద్యుత్ సరఫరాలకు అంతరాయం కలిగింది. అనంతపురం నగరంలో నిర్మాణ దశలో ఉన్న రెండు భవంతుల గోడలు కూలిపోయాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మోస్తరు వర్షానికే నగర వీధులు జలమయమయ్యాయి. డ్రైనేజీ నీరు రోడ్లపైకి చేరింది.

(వివరాలు 7లో..)



చంద్ర హాస్పిటల్ వద్ద కూలిన భవంతి గోడ.. ధ్వంసమైన బైకు

తోపు కుట్రలకు బలికావద్దు

పబ్బం కోసం ఫ్యాక్షన్ ఊబిలోకి లాగుతున్నారు

గంగుల, సానె కుటుంబాలకు పరిటాల సునీత వినతి

పదవులకు మీరు.. గొడవలకు బీసీలా..?

తోపుదుర్తి సోదరులపై మండిపాటు



అనంతపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో తోపుదుర్తి సోదరులు మళ్లీ కక్షలు రేపాలని చూస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ పబ్బం గడుపుకునేందుకు మద్దలచెరువు గంగుల కుటుంబం, కనుముక్కల సానె కుటుంబాన్ని గొడవల్లోకి లాగుతున్నారని ఆరోపించారు. వారి కుట్రలకు బలికావొద్దని గంగుల, సానె కుటుంబాలకు పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. పాపిరెడ్డిపల్లికి జగన్ వస్తున్న క్రమంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆయన సోదరులు చేస్తున్న వ్యాఖ్యలపై ఘాటుగా.. (మిగతా 6లో....)

ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తాం

హౌసింగ్ పీడీ జహీర్ అస్లాం



సమీక్షిస్తున్న హౌసింగ్ పీడీ జహీర్ అస్లాం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణం, అదనపు ఆర్థిక సాయం పక్కాగా అమలు చేయడమే తమ లక్ష్యమని హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ జహీర్ అస్లాం అన్నారు. ఇన్‌చార్జిగా నియమితులైన పంచాయతీరాజ్ ఎస్ఈ జహీర్ అస్లాం గురువారం హౌసింగ్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. హౌసింగ్ అధికారులు, ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. లక్ష్యాలను పూర్తి చేయడానికి కృషి చేయాలని సూచించారు. కొత్త ఇళ్లకు దరఖాస్తులు స్వీకరించేందుకు ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. గత ప్రభుత్వంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అదనపు సాయంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి, ఇళ్ల నిర్మాణం పూర్తి చేయించేందుకు హౌసింగ్ ఇంజనీర్లు పనిచేయాలన్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా, క్షేత్రస్థాయిలో పరిశీలించిన తరువాతే తుది నిర్ణయం ఉంటుందన్నారు. ప్రతి ఇంజనీరు నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గృహనిర్మాణం పథకాన్ని విజయవంతం చేయడానికి కృషి చేయాలని సూచించారు. ఆయా స్కీంల వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో మేనేజర్ ఖాసీం, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

సెల్ స్పాట్..!

విద్యార్థుల జీవితంలో పదో తరగతి ఫలితాలు అత్యంత కీలకమైనవి. ఏమాత్రం తేడా వచ్చినా నష్టపోతారు. అందుకే జవాబు పత్రాల మూల్యాంకన విధుల్లో ఉన్న వారు అప్రమత్తంగా వ్యవహరించాలి. కానీ నగరంలోని కేఎస్ఆర్ హైస్కూల్‌లోని స్పాట్ వాల్యుయేషన్ సెంటర్‌లో తొలిరోజు గురువారం చాలా మంది సెల్‌ఫోన్‌లలో మాట్లాడుతూ కనిపించారు. స్పాట్‌లో ఎవరూ సెల్ ఫోన్లు వాడకూడని జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. కానీ జవాబు పత్రాలు దిద్దే సమయంలోనే చాలామంది చెవుల్లో స్మార్ట్ ఫోన్‌లు కనిపించాయి. తొలిరోజు 821 మంది విధులకు హాజరయ్యారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం విద్య









స్పాట్‌లో సెల్‌ఫోన్ వినియోగిస్తున్న టీచర్లు

పోలీస్‌శాఖకు రూ.కోటి వస్తువుల వితరణ



డ్రోన్, సీసీ కెమెరాలను అందజేస్తున్న కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు

తాడిపత్రి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పలు కార్పొరేట్ కంపెనీలు కోటి రూపాయలు విలువైన వస్తువులను అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్‌కు గురువారం అందజేశారు. ఇందులో డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాలు, సోలార్ లైట్లు, బాడీ వెర్న్ కెమెరాలు వంటివి ఉన్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దాతల సంకల్పంతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. సీఎస్ఆర్ కింద సుమారు కోటి రూపాయలు విలువజేసే వస్తువులు అందజేయడం శుభపరిణామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వితరణ చేస్తున్న ఆయా కంపెనీలకు కృతజ్ఞతలు తెలియజేశారు. తాడిపత్రి అల్ట్రాటెక్ కంపెనీ రూ.10.05లక్షలు విలువ జేసే 50 సోలార్‌లైట్లు, మొబిక్ ఇండియా మ్యాడ్యుల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ రూ.33లక్షలు విలువజేసే 300 అత్యాధునిక సోలార్ సీసీ కెమెరాలు అందజేశారన్నారు. అర్జాస్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్ లిమిటెడ్ వారు రూ.18.17లక్షలు విలువగల 10డ్రోన్ కెమెరాలను అందజేశారు. సప్తగిరి క్యాంపర్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.5లక్షలు విలువజేసే 2డ్రోన్ కెమెరాలు 7 బాడీవోర్న్ కెమెరాలను అందజేశారు. జిందాల్ స్టీల్ కంపెనీవారు రూ.10లక్షలు విలువజేసే 6డ్రోన్ కెమెరాలను అందజేశారన్నారు. అదానీ కంపెనీవారు రూ.19లక్షలు విలువజేసే ఎల్ఈడీ డిస్‌ప్లే, మహీంద్ర బొలెరో వాహనాన్ని అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి, మొబిక్ ఇండియా మ్యాడ్యుల్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎస్ఆర్ సభ్యులు సింధూజ, శ్రీనివాస్, అర్జాస్ స్టీల్‌ప్లాంట్ సభ్యులు ఫెర్నాండస్, రాజేష్ రంజన్ ఠాకూర్, అదానీ సిమెంట్స్ అంకుర్ అగర్వాల్, చిత్వాన్, ప్లాంట్ చీఫ్ క్రిష్ణయ్యయాదవ్, జిందాల్ సభ్యులు సౌమ్యజ్యోతి సర్కార్, సుభాని, అల్ట్రాటెక్ సిమెంట్ సజేంద్రకుమార్, రంగకుమార్, అంజన్ ప్రకాష్ పాల్గొన్నారు.

1.2 కోట్ల పనిదినాలు కల్పిస్తాం

రూ.375 కోట్ల చెల్లింపు లక్ష్యం

కలెక్టర్ వినోద్‌కుమార్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో కూలీలకు 1.2 కోట్ల పని దినాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పథకం ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడమే కాక గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. గత ఏడాదిలో జిల్లాలో 2.12 లక్షల కుటుంబాలకు పని కల్పించి రూ. 287 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. నీటి నిల్వ సంరక్షణ పనులు చేపట్టి భూగర్భ జలాలు పెంపొందించినట్లు తెలిపారు. 8051 ఎకరాల్లో వివిధ రకాల ఉద్యాన పంటలు, పండ్ల తోటలు పెంచినట్లు వెల్లడించారు. ఈ ఏడాది 120 లక్షల పని దినాలు కల్పించి రూ.375 కోట్లు చెల్లించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా 8 వేల ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపడతామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పశువుల నీటి తొట్టెలు, ఫాంపాండ్లు, పూడికతీత పనులు చేపడుతున్నామన్నారు. సమావేశంలో డ్వామా పీడీ సలీంబాషా, పీఆర్ఎస్ఈ జహీర్‌అస్లాం పాల్గొన్నారు.

శాస్త్రీయంగా పాఠశాలల సర్దుబాటు

ప్రభుత్వ పాఠశాలల సర్దుబాటు శాస్త్రీయంగా ఉండాలని విద్యాధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించా రు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల సర్దుబాటు, పాఠశాల యాజమాన్య కమిటీల ఆమోదంతోనే చేపట్టాలన్నారు. ఎక్కడా ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా సర్దుబాటు ప్రక్రియ ఉండకూడదన్నారు. ఇప్పటికే 93 శాతం పాఠశాలల సర్దుబాటు ప్రక్రియ జరిగిందని మిగిలిన 7 శాతం వెంటనే ముగించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ ప్రసాద్‌బాబు, ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజా, ఎంఈఓలు పాల్గొన్నారు.

అమ్మా..! బాగున్నారా..

వీర జవాన్ సుబ్బయ్య కుటుంబ సభ్యులకు ఆర్డీఓ పరామర్శ



జవాన్ భార్య, పిల్లలతో మాట్లాడుతున్న ఆర్డీఓ

నార్పల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ల్యాండ్ మైన్ పేలి ఇటీవల మృతి చెందిన ఆర్మీ జవాన్ వీవీ సుబ్బయ్య కుటుంబాన్ని ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దారు అరుణకుమారి గురువారం పరామర్శించారు. సుబ్బయ్య భార్య లీలావతి, ఆమె పిల్లలతో మాట్లాడి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే డబ్బులు జవాన్ కుటుంబానికి అందేలా కృషి చేస్తామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారని వారు జవాన్ కుటుంబానికి వివరించారు. తనకు ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని సుబ్బయ్య భార్య లీలావతి కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆర్డీఓ తెలిపారు. పిల్లలను బాగా చదివించాలని లీలావతికి ఆర్డీఓ సూచించారు. సుబ్బయ్య మామ రామకృష్ణ, ఇతర కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉమాదేవి, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాస్‌మూర్తి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఈసారీ పాత రథమే!

పెన్నహోబిలంలో కొలిక్కిరాని రథం తయారీ



రథం తయారీకి సంబంధించిన శిలాఫలకం

ఉరవకొండ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ రథం తయారీ కొలిక్కి రావడం లేదు. టెండర్లు పూర్తయి ఏడాది కావస్తున్నా, నిర్మాణ పనులు అడుగు కూడా ముందుకు పడలేదు. బ్రహ్మోత్సవాలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఈసారి కూడా పాత రథంతోనే నిర్వహించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రథం నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయి, బడ్జెట్ కూడా కేటాయించారు. అయినా, రథం తయారీకి విరాళాలు సేకరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. ఇటీవల ఏటి గంగమ్మ తిరునాళ్ల సందర్భంగా ఆలయ ఈఓ పేరు మీద రథం నిర్మాణానికి విరాళాలు అందజేయాలని కరపత్రాలు ముద్రించారు. అధికారులే నూతన రథం నిర్మాణం రూ.2.3 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచి, వాటి పనులు ప్రారంభించినా కొత్తగా కరపత్రాలు ముద్రించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రథం తయారీ పనులు ఎనిమిది నెలలుపైగా నిలిచిపోయాయి. గతేడాది మార్చిలో రథం తయారీకి సంబంధించి అప్పటి వైసీపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హడావుడిగా శిలాఫలకాన్ని ఆవిష్కరించింది. దేవదాయ శాఖ దీనికి రూ.1.78 కోట్లు మంజూరు చేసింది. అందులో కోటి రూపాయలు భక్తులు అందించిన విరాళాలే ఉన్నాయి.

టెండర్లలోనూ గోల్‌మాల్

రెండేళ్ల క్రితం బ్రహ్మోత్సవాల సందర్భంగా పాత రథానికి మరమ్మతులు చేస్తుండగా అది కూలిపోయి ధ్వంసమైంది. ఆ ఏడాది పాత రథానికే మరమ్మతులు చేయించి, ఉత్సవాలు పూర్తి చేశారు. నూతన రథం తయారీకి టెండర్లు పిలిచారు. టెండర్లలో కూడా అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై పెద్ద దుమారమే లేచింది. రథం టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ సబ్‌లీజ్‌కు ఇచ్చారు. 8 నెలలుగా పనులు ఆగిపోయాయి. రథం తయారీకి ఉపయోగించే సామగ్రి నాణ్యతగా లేదన్న అంశం తెరపైకి రావడంతో ఆపేశారు. పనులు నెమ్మదిగా సాగడానికి ఇదొక కారణమన్న చర్చ అప్పట్లో నడిచింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఏడాదిలోపు పూర్తిచేసేలా అగ్రిమెంట్లు కూడా కుదుర్చుకున్నారు. అగ్రిమెంట్ కాలపరిమితి ముగుస్తున్నా ఆలయ అధికారులు.. రథం తయారీపై దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. రథం నిర్మాణానికి 18 నెలల కాలపరిమితి ఉందని కాంట్రాక్టర్లు చెప్పుకొస్తున్నారు. ఇప్పటికే 10 నెలలు గడిచిపోయినా రథం నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. దేవదాయ శాఖకు చెందిన ఇంజనీర్ రథం తయారీ పనులు పరిశీలించి, 5 నెలలు కావస్తున్నా ఎలాంటి పురోగతి కనిపించట్లేదు. బ్రహ్మోత్సవాలు దగ్గరపడుతున్నాయి. ఈసారి కూడా పాత రథంతోనే నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా దేవదాయ శాఖ ఉన్నతాధికారులు.. రథం నిర్మాణంపై దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

పరిశీలిస్తాం..

రథం టెండర్లకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించి, గడువు ఎంత వరకు ఉందో విచారిస్తాం. విషయాన్ని ఆర్జేసీ దృష్టికి తీసుకెళ్లి, రథం నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

-ఆదిశేషునాయుడు,
సహాయ కమిషనర్, దేవదాయ శాఖ

నేడు రాష్ట్రస్థాయి సదస్సు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ-వెలుగు ఉద్యోగులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు శుక్రవారం అనంతపురంలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య తెలిపారు. అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల నుంచి డీఆర్‌డీఏ పీడీలు, డీపీఎంలు, ఏపీఎంలు, సెర్ప్ ఉద్యోగు లు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు సదస్సుల్లో పాల్గొంటారన్నారు. ముఖ్య అతిథులుగా సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు.



ఆన్‌లైన్‌లోనే..!



వైసీపీ పాపం.. రైతులకు శాపం..
సాగులో ఉన్నా.. ఆన్‌లైన్‌లో భూముల తొలగింపు
కొత్త ప్రభుత్వంలో పరిష్కారానికి చర్యలు
రెవెన్యూ సదస్సుల్లో అర్జీల స్వీకరణ
వంద రోజులైనా పరిష్కారం ఏదీ?
అసైన్మెంట్ కమిటీ పేరుతో కాలయాపన

కూడేరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకుల పాపం.. రైతులకు శాపంగా మారింది. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను ఆన్‌లైన్ నుంచి తొలగించారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఆ భూములు ఇచ్చిన రుణాలను తిరిగి చెల్లించాలంటూ బ్యాంకులు ఒత్తిడి తెస్తున్నాయి. భూములు కోల్పోయి, రుణాలు తిరిగి చెల్లించలేక రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. గతేడాది ఏర్పాటైన కొత్త ప్రభుత్వం.. వైసీపీ భూఅరాచకాలపై దృష్టి పెట్టింది. అందులో భాగంగా ఊరూరా రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూసమస్యలపై అర్జీలు స్వీకరించారు.

మండలంలో 202 మంది రైతుల భూములను ఆన్‌లైన్ నుంచి అన్యాయంగా తొలగించారని అధికారులు క్షేత్రస్థాయి విచారణ ద్వారా తేల్చారు. వాటికి వంద రోజుల్లోగా అధికారులు పరిష్కారం చూపాల్సి ఉంది. అర్జీలు స్వీకరించి, వంద రోజులు దాటినా నేటికీ అర్హులుగా గుర్తించిన రైతుల భూములను ఆన్‌లైన్ చేయలేదు. అదేమిటంటే అసైన్మెంట్ కమిటీ అంటూ కాలయాపన చేస్తున్నారు. దీనిపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంకా ఎన్నాళ్లు అధికారుల చుట్టూ తిరగాలనీ, ఎన్నేళ్లు వేచి చూడాలని వాపోతున్నారు.

ఏకపక్షంగా తొలగింపు

కాంగ్రెస్ హయాంలో భూమిలేని పేదలను గుర్తించి, అసైన్మెంట్ కమిటీ ఆమోదంతో భూములు పంచి, పాసుపుస్తకాలు సైతం మంజూరు చేశారు. అప్పట్నుంచి ఆ భూములను ఏళ్లుగా నిరుపేదలు సాగు చేసుకుంటున్నారు. గత వైసీపీ హయాంలో 2020లో కనీస విచారణ కూడా చేయకుండా అసైన్మెంట్ కమిటీ పంచిన భూములను ఆన్‌లైన్ నుంచి తొలగించారు. తమ భూములను తిరిగి ఆన్‌లైన్‌లోకి ఎక్కించాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా.., ఆందోళనలు చేసినా వారు పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ నేపథ్యంలో గతేడాది కొలువుదీరిన కొత్త ప్రభుత్వం భూసమస్యలపై రెవెన్యూ సదస్సుల ద్వారా అర్జీలు స్వీకరించి, వంద రోజుల్లో పరిష్కారం చూపాలని ఆదేశించింది. మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల ద్వారా అధికారులు 242 అర్జీలను స్వీకరించారు. వాటిపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టి 202 మంది రైతులను అర్హులుగా గుర్తించి, నివేదికలు తయారు చేశారు. వాటిని ఉన్నతాధికారులకు పంపారు. అర్జీలు ఇచ్చి వంద రోజులు దాటినా భూసమస్యలు పరిష్కారం కాలేదు. నేటికీ భూములను ఆన్‌లైన్‌లోకి ఎక్కించలేదు. దీంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది.



ఉదిరిపికొండ గ్రామం వద్ద చీనీ సాగు చేస్తున్న భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ మహబూబ్ బాషా

రుణాలు చెల్లించలేక..

భూములను ఆన్‌లైన్ నుంచి తొలగించడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులకు కొత్త సమస్య వచ్చిపడింది. వాటిపై తీసుకున్న రుణాలు మొత్తం చెల్లించాలంటూ బ్యాంకర్లు ఒత్తిడి తెస్తున్నారు. ఎక్కడి నుంచి తెచ్చి కట్టాలని వారు వాపోతున్నారు. అర్హులను తేల్చిన వారి భూములను ఆన్‌లైన్‌లోకి ఎక్కించాలంటే అసైన్మెంట్ కమిటీ తీర్మానం అవసరమని అధికారులు చెబుతున్నారు. కమిటీ ఎప్పుడు ఏర్పాటు చేస్తారో, ఎప్పుడు ఆన్‌లైన్ చేస్తారోనని రైతులు నిట్టూరుస్తున్నారు.



ఉదిరిపికొండ గ్రామం వద్ద వేరుశనగ సాగు భూమిని పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్

ఎన్నిసార్లు తిరిగినా...



నా భార్య మునెమ్మ పేరున ఉన్న మూడున్నర ఎకరాల భూమిని ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం. కాంగ్రెస్ పాలనలో నాలుగో విడత అసైన్మెంట్ కమిటీలో పట్టాతోపాటు పాసుపుస్తకం ఇచ్చారు. అలాంటి భూమిని విచారణ చేయకుండా ఆన్‌లైన్ నుంచి తొలగించారు. ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. మూడు నెలల క్రితం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అర్జీ ఇచ్చాం. వంద రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. ఇంతవరకు కాలేదు.

- రామాంజనేయులు, రైతు, కూడేరు

నోటీసులు కూడా ఇవ్వకుండా..



నా పేరున ఉన్న మూడున్నర ఎకరాల భూమిలో చీనీ సాగు చేస్తున్నాం. ఏళ్లుగా సాగులో ఉన్న భూమిని నోటీసులు కూడా ఇవ్వకుండా ఆన్‌లైన్ నుంచి తొలగించారు. బ్యాంకులో తీసుకున్న రుణాన్ని బయటి వ్యక్తుల వద్ద అప్పు చేసి, చెల్లించాం. గ్రామంలో పలుసార్లు జరిగిన సభల్లో అర్జీలు ఇచ్చాం. ఇప్పటికైనా అధికారులు భూమిని ఆన్‌లైన్‌లోకి ఎక్కించాలని వేడుకుంటున్నా.

- పార్వతి, మహిళారైతు, ఉదిరిపికొండ గ్రామం

అసైన్మెంట్ కమిటీ ఆమోదం పొందాకే..



రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయి విచారణ చేశాం. సాగులో ఉండి ఆన్‌లైన్‌లో తొలగించిన భూములను గుర్తించి, నివేదికలు తయారు చేశాం. అర్హులైన రైతుల భూములను ఆన్‌లైన్‌లోకి ఎక్కించాలంటే అసైన్మెంట్ కమిటీ ఆమోదం పొందాలి. ప్రభుత్వం కమిటీ ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. అసైన్మెంట్ కమిటీ ఆమోదం పొందిన వెంటనే అర్హులైన రైతుల భూములు ఆన్‌లైన్‌లోకి ఎక్కిస్తాం.

- మహబూబ్ బాషా, తహసీల్దార్, కూడేరు

పెన్షన్ రూల్స్ సవరణను వెంటనే విరమించాలి

ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్, డాట్ పెన్షనర్స్ అసోసియేషన్



బీఎస్ఎన్ఎల్ జీఎం ముజీబ్ పాషాకు వినతిపత్రం అందజేస్తున్న ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్, డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం ప్రెస్ క్లబ్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పెన్షన్ రూల్స్ సవరణను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించాలని ఆల్ ఇండియా బీఎస్ ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ అండ్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. వారు బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించా రు. ఈకార్యక్రమానికి ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ సహాయ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ 8వ వేతన సవరణ సంఘంలో బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల రివిజన్ అంశం పాయింట్ ఆఫ్ రిఫరెన్స్‌గా చేర్చాలన్నారు. ఈ పెన్షన్ రూల్స్ వల్ల భవిష్యత్తులో పే కమిషన్ల వల్ల వచ్చే పెన్షన్ రివిజన్ పాత పెన్షనర్స్‌కు వర్తించకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ సవరణను దేశ వ్యాప్తంగా వ్యతిరేకించినట్లు వెల్లడించారు. అనంతరం బీఎస్ఎన్ఎల్ జీఎం ముజీబ్ పాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఓబుళు, ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్, సర్కిల్ సహాయ కార్యదర్శి సుభాన్, బ్రాంచ్ కార్యదర్శి బాలరంగయ్య, కుమార్, ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ డీఓటీ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి శివప్రసాద్, ఏపీ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్, జిల్లా కార్యదర్శి జయరామప్ప వివిధ శాఖల పెన్షనర్లు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల సబ్సిడీ ధరలు ఖరారు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాల సబ్సిడీ ధరలను ప్రభుత్వం ఖరారు చేసింది. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి గురువారం ఉత్తర్వులు అందాయి. మూడు రకాల విత్తనాలకు 50 శాతం సబ్సిడీని వర్తింజేశారు. జీలుగ క్వింటా పూర్తి ధర రూ.12300లు కాగా ఇందులో 50 శాతం సబ్సిడీపోను రైతు రూ.6150లుగా చెల్లించాల్సి ఉంటుంది. జనుము క్వింటా పూర్తి ధర రూ.10900లు కాగా ఇందులో సబ్సిడీపోను రైతు రూ.5450లు చెల్లించాలి. పిల్లిపెసర క్వింటా ధర రూ.18000లు కాగా సబ్సిడీపోను రైతు రూ.9వేలు చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాకు ఈ సారి జీలుగ 190 క్వింటాళ్లు, పిల్లిపెసర 15 క్వింటాళ్లు, జనుము 2 క్వింటాళ్లు కేటాయించారు.

తోపు కుట్రలకు బలికావద్దు

(5వ పేజీ తరువాయి)

స్పందించారు. ఫ్యాక్షన్ కారణంగా తన భర్త పరిటాల రవి, మామ, మరిదిని కోల్పోయామని, సానె కుటుంబంలో వారి తండ్రి, సోదరులను కోల్పోయి ఉమ ఒంటరిగా మారిపోయారని అన్నారు. గంగుల కుటుంబంలోనూ భానుమతి ఒంటరిగా మిగిలారని అన్నారు. ఫ్యాక్షన్ కారణంగా కుటుంబ సభ్యులను కోల్పోయి, పిల్లలను పోషించడానికి, చదివించేందుకు ఎన్నో ఇబ్బందులు పడ్డామని అన్నారు. ఒక పూట తినీ తినక నాలుగు గోడల మధ్య ఏడ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని అన్నారు. 'మీ కుటుంబంలో ఎవరినైనా కోల్పోతే ఇలాంటి బాధలు ఎలా ఉంటాయో తెలుస్తాయి' అని తోపుదుర్తి సోదరులనుద్దేశించి అన్నారు. ప్రశాంతంగా ఉన్న సమయంలో మళ్లీ గంగుల, సానె కుటుంబాలను మధ్యలోకి లాగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గంగుల, సానె కుటుంబాల మీద తోపుదుర్తి సోదరులకు అంత ప్రేమే ఉంటే అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు న్యాయం చేయలేదని ప్రశ్నించారు. ఏదైనా ఒక మంచి పదవి ఎందుకు ఇప్పించలేదని నిలదీశారు. ఇప్పుడైనా ఆ రెండు కుటుంబాలకు న్యాయం చేయగలరా..? ఎమ్మెల్యే టిక్కెట్ ఇప్పించగలరా అని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని నిలదీశారు. చేతనైతే 2029 ఎన్నికల్లో రాప్తాడు టిక్కెట్‌ను గంగుల లేదా సానె కుటుంబాలకు ఇప్పించాలని సూచించారు. కక్షలకు వారు, పదవులకు మీరా అని నిలదీశారు. మహిళలతో రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. పరిటాల కుటుంబం మొదటి నుంచి రెడ్డి సామాజిక వర్గంతో సఖ్యతగా ఉందని, వారికి పరిటాల కుటుంబం వ్యతిరేకమన్నట్లు తోపు సోదరులు ప్రచారం చేస్తున్నారని అన్నారు. తన భర్త హయాంలోనే రెడ్డి కులస్థులతో తమ కుటుంబానికి సంబంధాలు ఉన్నాయని గుర్తు చేశారు. '2019 ఎన్నికలకు ముందు మీ గెలుపు కోసం రెడ్డి సామాజికవర్గ ప్రజలు సొంత ఆస్తులు అమ్మి పనిచేశారు. అధికారంలోకి వచ్చాక వారినే ఇబ్బంది పెట్టారు. అందుకే వారు మీకు దూరమయ్యారు. మళ్లీ దగ్గర చేసుకునేందుకు పరిటాల కుటుంబాన్ని వాడుకుంటున్నారు' అని విమర్శించారు. వారిని నమ్మవద్దని రెడ్డి సామాజికవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తోపుదుర్తి చందు హైదరాబాదు నుంచి వచ్చేటప్పుడు కొందరు రెడ్డి సామాజికవర్గ పిల్లలకు ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపి, మద్యం తాపించి రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయిస్తున్నారని ఆరోపించారు. ఈ కారణంగా ఏవైనా గొడవలు జరిగితే పరిటాల కుటుంబంపై ఆరోపనలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు, లోకేష్‌పై చేసిన వ్యాఖ్యలకు తోపుదుర్తి చందును తుక్కుతుక్కుగా కొట్టాల్సిందని విరుచుకుపడ్డారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తోపుదుర్తి చందు తిట్టిన వీడియోలను ఆమె మీడియా ఎదుట ప్రదర్శించారు. 'మొద్దుశీను బతికిఉంటే నువ్వు పాదయాత్ర చేసేవాడివా?' అంటూ చందు చేసిన వ్యాఖ్యలను చూపించారు. అప్పట్లో దూషించి.. ఇప్పుడు చంద్రబాబు గారు... లోకేష్ గారని మర్యాద ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో టీడీపీవారు ఇలాంటి మాటలు మాట్లాడి ఉండే మీరు ఏం చేసేవారో ప్రజలందరికి తెలుసునని అన్నారు.

ఆపే శక్తి మీకు లేదు..

'రామగిరి ఎంపీపీ స్థానాన్ని మేము కావాలనుకుంటే ఆపే శక్తి మీకు లేదు' అని తోపుదుర్తి సోదరులనుద్దేశించి పరిటాల సునీత అన్నారు. అప్పట్లో చంద్రబాబు వద్దన్నందుకే తాము పోటీ చేయలేదని, లేదంటే ఆరు మండలాల ఎంపీపీ స్థానాలను గెలిచేవారమని అన్నారు. 'మీరు హైదరాబాదులో విలాసవంతంగా ఉండాలి. గొడవలకు బీసీలు వెళ్లాలా..?' అని నిలదీశారు. రాష్ట్రంలో అన్ని ఎంపీపీ స్థానాలను గెలిచామని గొప్పలు పోయే జగన్.. రామగిరిలో బలమున్నా గెలిపించుకోలేని దద్దమ్మ ఉన్నాడని గుర్తిస్తే మంచిదని అన్నారు. 'పాపిరెడ్డి పల్లిలో మీ పార్టీ నేత చనిపోతే ఎవరైనా పరామర్శించారా?' అని ప్రకాష్‌రెడ్డి అని ఆమె ప్రశ్నించారు. బీసీ సామాజికవర్గానికి చెందిన ఎస్ఐ సుధాకర్‌యాదవ్ విధులు నిర్వర్తిస్తే ఆయనను కించపరుస్తున్నారని, తప్పు చేసిన వారిని స్టేషన్‌కు పిలిపిస్తే ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతారా అని మండిపడ్డారు. ఎంపీటీసీల చేత తనతో ఫోన్‌లో మాట్లాడించారని ఎస్ఐ సుధాకర్‌యాదవ్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. చేతనైతే నిరూపించాలని సవాలు విసిరారు.

కారు బాంబు గురించి ఎందుకు మాట్లాడరు..?



తోపు సోదరులు ఎప్పుడూ టీవీ బాంబు గురించే ప్రస్తావిస్తుంటారని, కారు బాంబు గురించి ఎందుకు మాట్లాడరని పరిటాల సునీత నిలదీశారు. కారు బాంబుతో 24 మందిని పొట్టనపెట్టుకున్నది వాస్తవం కాదా ప్రశ్నించారు. అందులో జర్నలిస్టులు కూడా ఉన్నారని, ఈ సంఘటనలో తోపు సోదరులు జైలుకు వెళ్లి వచ్చారని గుర్తు చేశారు. పాపంపేటలో ఇళ్ల కూల్చివేత వెనుక పరిటాల కుటుంబం హస్తం ఉందని ప్రకాష్‌రెడ్డి చేసిన విమర్శలపై ఆమె ఘాటుగా స్పందించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కలెక్టర్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారని, ఇందులో ఎక్కడా రాజకీయ నాయకుల ప్రమేయం లేదని అన్నారు. ఇళ్ల కూల్చివేతను మొదట అడ్డుకున్నది తమ పార్టీ నాయకులేనని అన్నారు. ఆ సమయంలో ప్రకాష్‌రెడ్డి ఎక్కడున్నారని ప్రశ్నించారు. మూడు రోజుల తరువాత రాజకీయం చేశారని మండిపడ్డారు. తాను రూ.8 కోట్లు తీసుకుని అక్కడ భవనాలు కట్టాలని చూస్తున్నానని ఆరోపించారని, దమ్ముంటే నిరూపించాలని ఆమె సవాల్ విసిరారు. జేసీబీలకు రాప్తాడు నియోజకవర్గ ప్రజలు భయపడరని, తోపుదుర్తి సోదరులు మాత్రమే భయపడతారని అన్నారు. తాను కూల్చాలనుకుంటే హైదరాబాదులోని తోపుదుర్తి సోదరుల బంగ్లాను కూలుస్తానని అన్నారు. ఇల్లు లేదు.. అద్దె ఇంట్లో ఉన్నామంటూ దొంగ ఏడుపులు ఏడ్చే ప్రకాష్‌రెడ్డి సోదరులకు హైదరాబాదులో భవనాలు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. లేనప్పుడు మరోలా వ్యవహరించే పద్ధతి పరిటాల కుటుంబానిది కాదని అన్నారు. పరిటాల కుటుంబం ఇచ్చే కుటుంబమే తప్ప.. తీసుకునే కుటుంబం కాదని ఆమె స్పష్టం చేశారు.

సీజనల్ వ్యాధులను నియంత్రించండి

డీడీ రామనాథం ఆదేశం



సమీక్షలో మాట్లాడుతున్న స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ రామనాథం

అనంతపురం టౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్లను స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టరు రామనాథం ఆదేశించారు. జిల్లాకేంద్రంలో ఉమ్మడి జిల్లా సబ్‌యూనిట్ ఆఫీసర్లతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌యూనిట్ ఆఫీసర్లు బాధ్యతగా పని చేయాలన్నారు. చాలామంది క్షేత్రస్థాయిలో తిరగకుండా సొంత వ్యవహారాలు సాగి స్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.

అలాంటి వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో తిరుగుతూ అన్నిశాఖలతో సమన్వయం చేసుకొని సీజనల్ వ్యాధుల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంఓ డాక్టరు ఓబులు, డిప్యూటీ మలేరియా ఆఫీసర్ సత్యనారాయణ, ఉమ్మడి జిల్లాల మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

అన్నదాతల్లో ఆశలు..!

టీడీపీ పాలనలో మాల్యం బ్రాంచి కాలువ నిర్మాణం.. అప్పట్లో నీరు కూడా విడుదల

వైసీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యం
నీరు వదల్లేదు.. నిధులూ ఇవ్వలేదు..
కొత్త ప్రభుత్వం నిధుల కేటాయింపుతో చిగురించిన ఆశలు

2018లో కాలువలో ప్రవహిస్తున్న నీరు





కాలువలో పెరిగిన ముళ్ల పొదలు

కణేకల్లు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తమది రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ పాలకులు.. క్షేత్రస్థాయిలో మాత్రం అన్నదాతల ఆశలపై నీళ్లు కుమ్మరించారు. మాల్యం బ్రాంచి కాలువే అందుకు నిదర్శనం. టీడీపీ హయాంలో కాలువను నిర్మించారు. 2018లో నీరు కూడా వదిలారు. కాలువ పక్కనే పొలాలున్న రైతులు పంటలు పండించుకున్నారు. పిల్ల కాలువలు తవ్వి పొలాలకు నీరందంచేందుకు చర్యలు చేపట్టారు. ఇంతలోనే 2019 ఎన్నికలొచ్చాయి. అప్పట్లో అధికారం చేపట్టిన వైసీపీ.. కాలువ పనులను అటకెక్కించింది. ఐదేళ్లలో పైసా కూడా నిధులివ్వలేదు. నీరు కూడా విడుదల చేయలేదు. తద్వారా రైతన్న ఆశలకు గండికొట్టారు. పిల్లకాలువల కోసం సేకరించిన భూములకు సంబంధించి కనీసం పరిహారం కూడా ఇవ్వలేదు. దీంతో ఆరేళ్లుగా రైతులు ఎదురుచూస్తూనే ఉన్నారు. ఇటీవల కొత్త ప్రభుత్వం హంద్రీనీవాకు నిధుల కేటాయింపుతో మళ్లీ అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. పిల్ల కాలువల నిర్మాణం చేపట్టి, పొలాలకు నీరు వదులుతారని రైతులు ఆనందపడుతున్నారు.

అప్పట్లో నీరు విడుదల

మండలంలోని హనకనహాళ్, సొల్లాపురం, మాల్యం, కళేకుర్తి, తుంబిగనూరు గ్రామాలకు సాగునీరు అందించేందుకు టీడీపీ హయాంలో కాలువ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) 36ఏ ప్యాకేజీ కింద మాల్యం బ్రాంచ్ కెనాల్ 21 కిలోమీటర్లు తవ్వారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల ద్వారా కాలువకు నీరిచ్చేలా నిర్ణయించారు. ప్రధాన కాలువ నిర్మాణం 2018లో పూర్తయింది. దీని కింద దాదాపు 17 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అప్పట్లో కళేకుర్తి చెరువుతోపాటు కాలువ పక్కన పొలాలున్న రైతులు పంటలు కూడా సాగు చేసుకున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారం కింద వప్పుశనగ పంట మాత్రమే సాగు చేసుకునే ఈ ప్రాంత రైతులు.. అప్పట్లో హంద్రీనీవా నీరు రావడంతో సంబరపడ్డారు. వేలాది ఎకరాల్లో రైతులు పంటలు కూడా సాగు చేసుకున్నారు. పిల్లకాలువలు తవ్వి, పొలాలకు నీరు ఇవ్వాలని నిర్ణయించారు. ఆ దిశగా అప్పట్లో చర్యలు చేపట్టారు. ఎకరాకు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల మేర పరిహారంగా ప్రకటించారు. ఆయా గ్రామాల్లో సభలు నిర్వహించి, పిల్లకాలువలకు అవసరమైన దాదాపు 1500 ఎకరాల భూమిని సేకరించారు. ఇందులో అనేక మందికి పరిహారం డబ్బు కూడా జమ చేశారు. మరో రూ.50 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉండేది.

వైసీపీ నిర్లక్ష్యం

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ.. మాల్యం బ్రాంచి కాలువను పూర్తిగా విస్మరించింది. కాలువకు నీరివ్వలేదు. దీంతో కాలువలో ముళ్లకంపలు పెరిగిపోయాయి. ప్రధాన, పిల్ల కాలువల పనులు ముందుకు కదలలేదు. కనీసం

మళ్లీ ఆశలు

కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో మాల్యం బ్రాంచి కెనాల్ పరిధిలోని రైతుల ఆశలు చిగురించాయి. ఇటీవల అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం హంద్రీనీవా పునరుద్ధరణకు రూ.రెండు వేల కోట్లు కేటాయించగా.. అందులో తమ ప్యాకేజీ డబ్బు కూడా వస్తాయన్న ఆశతో రైతులు ఉన్నారు. కాలువ పనులు పూర్తై నీరు వస్తుందని సంబరపడుతున్నారు. మళ్లీ పంటలు సాగుచేసుకునే రోజు వస్తుందని ఎదురుచూస్తున్నారు.

మోటార్లు పెట్టి నీటిని తోడుకున్నాం



హంద్రీనీవా ప్రధాన కాలువ పక్కనే మాకు 20 ఎకరాల పొలం ఉంది. 2018-19 సంవత్సరంలో కాలువకు వదిలిన నీటిని మోటార్ల ద్వారా తోడుకుని, పంటలు పండించుకున్నాం. ఆ తర్వాత నీరు వదలకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

-హరి, రైతు, మాల్యం

బకాయిలు చెల్లించాలి



హంద్రీనీవా పిల్ల కాలువలకు రెండెకరాలు ఇచ్చా. అప్పట్లో ప్రభుత్వం ఎకరాకు రూ.10లక్షల మేర పరిహారం చెల్లిస్తున్నట్లు ప్రకటించింది. ఆరేళ్లు కావస్తున్నా సొమ్ము అందలేదు. ఇప్పటికైనా రైతులకు బకాయిలు చెల్లిస్తే బాగుంటుంది.

-రజాక్, రైతు, మాల్యం

నూతన ప్రభుత్వంపై ఆశలు



వైసీపీ ప్రభుత్వం హంద్రీనీవాను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. నూతన ప్రభుత్వం ఆశలు రేపుతోంది. హంద్రీనీవాపై ఇప్పటికే మంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పలుమార్లు అధికారులతో చర్చలు జరిపారు. కాలువకు నీరు వదలితే పంటలు పండించుకుంటాం.

- అశోక్, రైతు, మాల్యం

త్వరలోనే పనులు ప్రారంభించే అవకాశం

త్వరలోనే హంద్రీనీవా కాలువకు సంబంధించి పెండింగ్ పనులు పూర్తి చేసి, నీరు విడుదల చేస్తాం. బడ్జెట్‌లో హంద్రీనీవాకు సంబంధించి రైతులకు బకాయి పడ్డ భూసేకరణ సొమ్ము అందించడంతోపాటు కాలువ పరిధిలో అసంపూర్తిగా ఉన్న పనులు కూడా పూర్తి చేసే అవకాశం ఉంది.

-శ్రీనివాసనాయక్, హంద్రీనీవా ఈఈ

గాలివాన బీభత్సం

కూలిన గోడలు.. విరిగిన చెట్లు
విద్యుత్ సరఫరాకు అంతరాయం
పిడుగుపాటుకు మహిళ మృతి
అనంత రోడ్లను ముంచెత్తిన మురుగునీరు


వర్షపు నీటితో అనంత ఆర్టీసీ బస్టాండ్ ఆవరణం

అనంతపురం అర్బన్/రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో బుధ, గురువారాల్లో తేలికపాటి వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో వాతావరణం చల్లబడింది. అక్కడక్కడ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అనంతపురం నగరంలో సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఆ పాటి నీటికే రహదారులు, వీధులు జలమయమయ్యాయి. డ్రైనేజీ నీరు రోడ్లపైకి చేరింది. రామ్‌నగర్, గుల్జార్ పేట, రాజు రోడ్డు, సప్తగిరి సర్కిల్‌లో రోడ్లు మడుగులను తలపించాయి. ఆర్టీసీ బస్టాండు ఆవరణలో నీరు నిలిచింది. బొమ్మనహాళ్, రామగిరి, కొత్తచెరువు, బెళుగుప్ప, ఉరవకొండ మండలాల్లో జల్లులు పడ్డాయి. డి.హీరేహాళ్ మండలంలో బుధవారం 10 మి.మీ. వర్షపాతం నమోదైంది. రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాల్లో 4.2, బ్రహ్మసముద్రంలో 3.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

● గుంతకల్లు మండలం కదిరిపల్లికి చెందిన బుట్ట ఇంద్రజ(24) గురువారం సాయంత్రం పిడుగుపాటుకు మృతిచెందారు. భర్త వెంకటరమణతో కలిసి వేరుశనగ పొలంలో పనులు చేస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన గాలులు వీచాయి. ఇదే సమయంలో పిడుగు పడటంతో ఇంద్రజ అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, పొలానికి వెళ్లి బోరున విలపించారు. ఇంద్రజకు రెండేళ్ల క్రితం వెంకటరమణతో వివాహం జరిగింది. వీరికి ఏడాది వయసుగల కూతురు ఉంది. ఈ సమాచారాన్ని తహసీల్దారుకు తెలియజేశారు.


ఇంద్రజ (ఫైల్)


నగరంలోని సప్తగిరి సర్కిల్ వద్ద..


రామగిరి వీధుల్లో పారుతున్న వర్షపు నీరు

● బొమ్మనహాళ్ మండలం శ్రీధరఘట్ట, సింగానహళ్లి, ఉద్దేహాళ్, ఉప్పరహాళ్ తదితర గ్రామాలలో బుధవారం అర్ధరాత్రి మోస్తరు వర్షం కురిసింది. భారీ ఈదురుగాలులు వీచాయి. దీంతో అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఏఈ లక్ష్మీరెడ్డి సిబ్బందితో కలిసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

● రామగిరి మండలం గరిమేకలపల్లి, ఎంసీ పల్లి, మంగాపురం, పేరూరు తదితర గ్రామాలలో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. రామగిరి, కొత్తపల్లి, చెర్లోపల్లిలలో జల్లులు పడ్డాయి. ఈదురుగాలులకు మొక్కజొన్న, వరి పంటలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. తొలగించిన వేరుశనగ పంట తడిసిపోయింది.

● పుట్టపర్తి రూరల్: శ్రీసత్యసాయి జిల్లాలో గురువారం పలుచోట్ల చిరుజల్లులు పడ్డాయి. ఎండలు, ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలు చల్లటి వాతావరణంలో సేదతీరారు. పుట్టపర్తిలో సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. కదిరి, బత్తలపల్లి, ధర్మవరం, గోరంట్ల, తాడిమర్రిలో చిరుజల్లులు పడ్డాయి. పుట్టపర్తిలో గురువారం గరిష్ఠ ఉష్ణోగ్రత 32 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 23 డిగ్రీలు నమోదైంది. కదిరిలో 32 డిగ్రీలు, 23 డిగ్రీలు, ధర్మవరంలో 32 డిగ్రీలు, 24 డిగ్రీలు, హిందూపురంలో 31 డిగ్రీలు, 23 డిగ్రీలు, పెనుకొండలో 32.0 డిగ్రీలు, 23 డిగ్రీల గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి


పాపంపేటలో పడిపోయిన షాపింగ్ మాల్ గోడ

● వర్షం కారణంగా అనంతపురం జిల్లా కేంద్రంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా గురువారం సాయంత్రం నుంచి నిలిచిపోయింది. రాప్తాడు, అనంతపురం రూరల్, గార్లదిన్నె, కూడేరు, శింగమల తదితర ప్రాంతాల్లో ఈదురుగాలు వీయడంతో చెట్లు నేలకొరిగాయి. కొమ్మలు విరిగి పడటంతో విద్యుత్తు తీగలు దెబ్బతిన్నాయి. అనంతపురం నగరంలోని ఎర్రనేల కొట్టాలలో చెట్టువిరిగి విద్యుత్ తీగలపై పడింది. దీంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.

కూలిన గోడలు

● అనంతపురం రూరల్ మండల పరిధిలోని పాపంపేటలో ఓ షామింగ్ మాల్ గోడ కూలింది. ఆ సమయంలో వర్షం కారణంగా అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పాపంపేట సర్కిల్‌లో ఓ షాపింగ్ మాల్‌ను కొత్తగా ప్రారంభించారు. దాని వెనుక భాగంలోని రెండో అంతస్తులో నిర్మాణ దశలో ఉన్న గోడ కూలింది. సిమెంట్ పెల్లలు విద్యుత్ తీగలపై పడటంతో స్తంభాలు కూలిపోయాయి. దీంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాత్రి ఎనిమిది గంటల వరకూ చీకట్లో గడపాల్సి రావడంతో షాపింగ్ మాల్ నిర్వాహకులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గోడ నిర్మాణంలో నాణ్యత పాటించని కారణంగా ఇలా జరిగిందని ఆరోపించారు. లైట్ వెయిట్ బ్రిక్స్ కావడంతో గాలికి గోడ కూలిపోయిందని అంటున్నారు. నిర్మాణ దశలో ఉన్న భవంతిలో షాపింగ్ మాల్‌ను ఎలా ప్రారంభిస్తారని మండిపడ్డారు.


చంద్ర ఆసుపత్రి సమీప నిర్మాణంలో ఏడో అంతస్తు గోడ కూలిన దృశ్యం

● అనంతపురం నగరంలోని చంద్ర హాస్పిటల్ సమీపంలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవంతి గోడ కూలిపోయింది. ఏడో అంతస్తుపై నుంచి గోడ కూలడంతో కింద ఉన్న వాహనాలు దెబ్బతిన్నాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.


అనంతపురంలోని రాంనగర్‌లో రోడ్డుపై వర్షపు నీరు

వానకు తడిసిన మద్యం బాక్సులు

అనంతపురం నగరంలోని ఐఎంఎల్ డిపో ఆవరణలో మద్యం బాక్సులు వర్షంలో తడిసిపోయాయి. మద్యం దుకాణాలను తరలించేందుకు వాహనాల్లోకి చేరుస్తుంగా వర్షం కురిసింది. దీంతో బాక్సులు తడిసిపోయాయి. వాహనాల్లోని టార్పలిన్‌లతో కప్పేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో మద్యం బాటిళ్లపై ధరల స్టిక్కర్లు తొలగిపోయాయి. వాటిని విక్రయించేందుకు సమస్యలు తలెత్తుతాయని, తడిసిన బాక్సులకు బదులుగా ఇతర బాక్సులు ఇవ్వాలని పలువురు వ్యాపారులు కోరారు. అయినా అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాక్సులు తడిసిన మాట వాస్తవమేనని, ధరల స్టిక్కర్లు తొలగిపోయిన విషయం తమ దృష్టికి రాలేదని సంబంధిత అధికారి అన్నారు.


తడిసిపోయిన మద్యం బాక్సులు

నీట మునిగిన ఆశాదీపాలు

వేర్వేరుచోట్ల ఈతకెళ్లి ఇద్దరు బాలుర మృతి
కన్నీటి పర్యంతమైన కుటుంబీకులు

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేర్వేరుచోట్ల గురువారం నీటమునిగి ఇద్దరు బాలురు మృతిచెంది, వారి కుటుంబాల్లో కన్నీళ్లు నింపారు. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన విద్యార్థి సంజయ్‌కుమార్ (13) చెరువులోకి ఈతకెళ్లి మరణించాడు. పట్టణంలోని వడ్డే బండ వీధికి చెందిన గోవిందరాజులు, లలితమ్మ దంపతుల కుమారుడు సంజయ్‌కుమార్ ఏడో తరగతి చదువుతుం డేవాడు. గురువారం పాఠశాలకు వెళ్లలేదు. స్నేహితులతో కలిసి పట్టణ చివరలో ఉన్న ఊరి చెరువు వద్దకు ఈతకెళ్లాడు. చెరువులోకి దిగిన సంజయ్‌కుమార్ నీట మునుగుతుండడంతో స్నేహితులు భయంతో పరుగులు తీశారు. అటుగా వెళ్తున్న ఆటోడ్రైవర్ గమనించి, వెంటనే సంజయ్‌కుమార్‌ను బయటకు తీసి, ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబసభ్యులు, బంధువులు.. ఆస్పత్రికి చేరుకుని, బోరున విలపించారు. ప్రమాదంపై పట్టణ దర్యాప్తు చేస్తున్నారు.


సంజయ్‌కుమార్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కాలువలో మునిగి..

పెద్దవడుగూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని సి.రామరాజుపల్లి సమీపంలోని బెంచి కాలువలో మునిగి హరినాథ్ రెడ్డి (14) అనే బాలుడు మృతిచెందాడు. దిమ్మగుడి గ్రామానికి చెందిన ఓబుల్‌రెడ్డి, నాగవేణి దంపతులు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. దిమ్మగుడిలో ఉన్న ఎకరా పొలంలో పనులు చేసేందుక కుమారుడు హరినాథ్ రెడ్డిని పంపారు. పొలం సమీపంలో ఉన్న బెంచి కాలువలోకి స్నేహితులతో కలిసి హరినాథ్ రెడ్డి ఈతకెళ్లాడు. ఈత సరిగా రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. అతడు ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో స్నేహితులు గమనించి, గ్రామంలోని ప్రజలకు సమాచారం అందించారు. వారు వచ్చి బాలుడిని బయటకు తీయగా.. అప్పటికే మృతిచెందాడు. దీనిపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


హరినాథ్‌రెడ్డి (ఫైల్)

మట్టి పెల్లెలు పడి యువకుడు..

హిందూపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పరిగి మండలంలోని పెద్దిరెడ్డిపల్లి సమీపంలోని పెన్నానది పరివాహక ప్రాంతంలో ఇసుక తవ్వకాలు చేస్తుండగా మట్టి పెల్లలు పడి గురువారం ఓ యువకుడు దుర్మరణం చెందాడు. హిందూపురం వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీధర్ తెలిపిన మేరకు పరిగి మండలం పెద్దిరెడ్డిపల్లికి చెందిన శివలింగప్ప కుమారుడు హేమంత్‌కుమార్ (29) తన సొంత ట్రాక్టర్ తీసుకెళ్లి ఇసుక కోసం మట్టి పెల్లలు తొలగిస్తున్న సమయంలో అవి మీదపడ్డాయి. దీంతో హేమంత్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమీపంలో ఉన్నవారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మట్టి పెల్లలు తొలగించే సమయానికి ప్రాణాలు విడిచాడు. రూరల్ పోలీసులు సంఘట నా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా రాత్రైనా పోస్టుమార్టం నిర్వహించక పోవడంతో బంధువులు, కుటుంబ సభ్యులు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి గేటు ఎదురుగా రహదారిపై ఆందోళన చేశారు. వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు అక్కడికి వెళ్లి బాధితులకు సర్ది చెప్పి వైద్యులను సంప్రదించి వెంటనే పోస్టుమార్టం అయ్యేలా చర్యలు తీసుకున్నారు.


హేమంత్‌కుమార్ (ఫైల్)

ప్రాణం పోయినా పట్టించుకోరా..?

15 రోజుల క్రితం
విద్యుత్ ప్రమాదంలో లైన్‌మన్‌కు గాయాలు
చికిత్స పొందుతూ మృతి
అధికారుల నిర్లక్ష్యంపై కుటుంబీకుల ఆగ్రహం
న్యాయం చేసే వరకు శవాన్ని తీసేది లేదంటూ స్పష్టం
ఉన్నతాధికారుల హామీతో ఎట్టకేలకు ఖననం

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): లైన్‌మన్ రామచంద్రారెడ్డి 15 రోజుల క్రితం విద్యుత్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, మరణించినా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై కుటుంబీకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం చేసేవరకు శవాన్ని ఖననం చేసేదిలేదంటూ భీష్మించారు. ఉన్నతాధికారుల హామీతో ఎట్టకేలకు గురువారం సాయంత్రం ఖననం చేశారు. పట్టణ పరిధి చౌడేశ్వరీ కాలనీకి చెందిన లైన్‌మన్ రామచంద్రారెడ్డి సోమందేపల్లిలో విధులు నిర్వర్తిస్తుండేవారు. గతనెల 19వ తేదీ ఉదయం సోమందేపల్లిలో విద్యుత్ సరఫరాలో సమస్య తలెత్తడంతో లైన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ.. రామచంద్రారెడ్డిని పిలిపించుకున్నాడు. ఎల్‌సీ తీసుకోకుండా ఒక లైన్ ఆఫ్ చేయించి రామకృష్ణ విద్యుత్ స్తంభం కింద ఉండి.. రామచంద్రారెడ్డిని పైకి ఎక్కించాడు. అతడు స్తంభం ఎక్కినపుడు విద్యుత్ సరఫరా లేదు. తరువాత ఉన్నఫలంగా విద్యుత్ సరఫరా కావడంతో రామచంద్రారెడ్డి స్తంభంపైనే విలవిల్లాడాడు. లైన్‌ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ విద్యుత్ సరఫరా నిలిపివేశాడు. గాయపడిన రామచంద్రారెడ్డిని బెంగళూరులోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 2వ తేదీన అతడు మృతిచెందాడు. హిందూపురానికి మృతదేహాన్ని తీసుకొచ్చారు. తమకు న్యాయం చేసేవరకు మృతదేహాన్ని ఖననం చేయమని రామచంద్రారెడ్డి కుటుంబీకులు తేల్చి చెప్పారు. దీంతో విద్యుత్ యూనియన్ల నేతలు, ఉన్నతాధికారులు.. వారి ఇంటికి చేరుకున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామనీ, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని విద్యుత్ శాఖ ఎస్‌ఈ సురేంద్ర హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. గురువారం సాయంత్రం రామచంద్రారెడ్డి మృతదేహాన్ని ఖననం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన లైన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిసింది. సోమందేపల్లి ఏఈఈ పరమేశ్వర్ రెడ్డిని తప్పిస్తూ అగళికి బదిలీ చేయడంపై యూనియన్ నాయకులు మండిపడ్డారు. ఇదే విషయమై డీఈఈ భూపతిని నిలదీశారు. ఏఈఈపై చర్యలు తీసుకోకూడదంటూ ఓ మంత్రి నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు వచ్చినట్లు చర్చ సాగుతోంది.


డీఈఈ భూపతిని నిలదీస్తున్న మృతుడి బంధువులు

గంజాయి విక్రేతల అరెస్ట్

హిందూపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పెనుకొండ దర్గాకు వచ్చిపోయే ఫకీర్ల వద్ద గంజాయి కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల్లో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను హిందూపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ మహేష్ గురువారం వెల్లడించారు. హిందూపురం పట్టణం హస్నాబాద్‌కు చెందిన జాహిద్ అహ్మద్, మేళాపురం వాసి షేక్ తబ్రేజ్, నేతాజీనగర్‌కు చెందిన సాయివినయ్ అలియాస్ 999, అహ్మద్‌నగర్‌కు చెందిన ఇమ్రాన్ కలిసి పెనుకొండ దర్గాకు వచ్చి వెళ్లేవారు. ఈ సందర్భంలో పెనుకొండ దర్గాపేటకు చెందిన సయ్యద్‌బాబా ఫకృద్దీన్ పరిచయమయ్యాడు. దర్గాకు వచ్చిపోయే ఫకీర్ల వద్ద గంజాయి సేవించడం అలవాటుపడ్డారు. ఆ తరువాత ఓ ఫకీర్ వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి, సేవిస్తూ దానిని హిందూపురంలోని కొంతమందికి విక్రయించేవారు. పోలీసులకు రాబడిన సమాచారంతో గురువారం కొడికొండ-శిర హైవేలోని బైలాంజనేయస్వామి ఆలయం వద్ద నిందితులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా.. సీఐలు ఆంజనేయులు, జనార్దన్, ఎస్‌ఐ శ్రీధర్ అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 600 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. సమావేశంలో సీఐలు రాజగోపాల్‌నాయుడు, ఆంజనేయులు, జనార్దన్, అబ్దుల్ కరీం, ఎస్‌ఐ శ్రీధర్ పాల్గొన్నారు.


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

స్నాతకోత్సవానికి రండి

గవర్నర్‌కు జేఎన్‌టీయూ వీసీ ఆహ్వానం

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ 14వ స్నాతకోత్సవానికి రావాలని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం విజయవాడలో గవర్నర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. వర్సిటీ అభివృద్ధి కార్యకలాపాలు, ఇంటర్నల్ రెవెన్యూ జనరేషన్, హరిత వాతావరణం, అధ్యాపకుల నియామకాలు తదితర అంశాలపై గవర్నర్ ఆరా తీశారని వీసీ తెలిపారు.


గవర్నర్‌ను ఆహ్వానిస్తున్న వీసీ

దొంగలు పడ్డ నాలుగు నెలలకు..

బంగారం చోరీపై ఎట్టకేలకు కేసు నమోదు

యాడికి, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): ఇంట్లో దొంగలు పడిన నాలుగు నెలల తరువాత ఎట్టకేలకు పోలీసులు కేసు నమోదు చేశారు. యాడికిలోని కమ్మవీధికి చెందిన మినుమనూరు వెంకటశివ ఇంట్లో గతేడాది డిసెంబరు 1న దొంగలు పడి, 13.5 తులాల బంగారాన్ని చోరీ చేశారు. రెండురోజులు ఆలస్యంగా చూసుకున్న బాధితుడు అప్పటి నుంచి కేసు నమోదుకు పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. చోరీ విషయాన్ని తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి దృష్టికి తీసుకెళ్లాడు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలోనూ అర్జీ ఇచ్చాడు. పోలీసులు కేసు మాత్రం నమోదు చేయలేదు. ఎట్టకేలకు నాలుగు నెలల తర్వాత బంగారం చోరీపై కేసు కట్టడం గమనార్హం. మండలంలోని పెద్దపేట గ్రామంలోని చిన్న సంజీవరాయుడు ఇంట్లో గతనెల 15న దొంగలు పడి 13.5 తులాల బంగారం చోరీ చేశారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు చేసినా.. తొలుత పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఎట్టకేలకు 20 రోజులకు కేసు నమోదుచేయడం గమనార్హం.

పింఛన్ సొమ్ముతో ప్లానింగ్ సెక్రటరీ పరార్

సచివాలయానికి తాళం వేసిన పింఛన్‌దారులు

ధర్మవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక లోనికోటలోని 14వ సచివాలయంలో ప్లానింగ్ సెక్రటరీగా పనిచేస్తున్న హరి పింఛన్ సొమ్ముతో గురువారం ఉడాయించాడు. పింఛన్ సొమ్మును అతడు సొంతానికి వాడుకున్నాడు. విషయం తెలుసుకున్న పింఛన్‌దారులు 14వ సచివాలయానికి తాళంవేసి, నిరసన తెలిపారు. ప్లానింగ్ సెక్రటరీ హరి ప్రతినెలా పింఛన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడుతూ.. డబ్బు ఆలస్యంగా ఇచ్చేవాడు. ఈనెల 1వ తేదీన బ్యాంకు నుంచి రూ.1.50 లక్ష డ్రా చేసి, కొంతమంది లబ్ధిదారులకు పంపిణీ చేశాడు. మిగతావారు 1న సచివాలయం వద్దకు వెళ్లగా.. అక్కడ సమాధానం చెప్పేవారు లేరు. దీంతో వారు ఆగ్రహంతో సచివాలయానికి తాళం వేశారు. విషయాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ దృష్టికి సిబ్బంది గురువారం తీసుకొచ్చారు. దీంతో కమిషనర్.. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీలైనంత త్వరగా డబ్బు రికవరీ చేసి, పింఛన్‌దారులకు అందజేస్తామని కమిషనర్ తెలిపారు. సచివాలయ తాళం మాత్రం తీయకపోవడం గమనార్హం.


సచివాలయానికి తాళం వేసిన దృశ్యం

రైలు కిందపడి యువకుడి మృతి

తాడిపత్రి, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): మండలంలోని యల్లనూరు రోడ్డు గేట్ సమీపంలో గురువారం రైలుకిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మృతిచెందిన వ్యక్తి వయసు 30 సంవత్సరాలు ఉంటుందనీ, నీలపురంగు చొక్కా ధరించి ఉన్నాడనీ, అతడి చేతిపై అమ్మ, ప్రసన్న, దస్తగిరి అనే పేర్లు ఉన్నాయన్నారు. ఆచూకీ తెలిసిన వారు ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

పామిడి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన ఉప్పర నారాయణ, మస్తానమ్మ దంపతుల కుమార్తె, సీనియర్ ఇంటర్ విద్యార్థిని ఉప్పర గౌతమి (17) గురువారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... విద్యార్థిని గౌతమి తిరుపతిలోని చంద్రగిరి ప్రభుత్వ కళాశాలలో సీనియర్ ఇంటర్ ఒకేషనల్ పరీక్షలు ఇటీవలే రాసింది. మొదటి సంవత్సరానికి సంబంధించి కొన్ని సబ్జెక్టులో ఫెయిల్ అయ్యింది. ఏప్రిల్ రెండో వారంలో పరీక్ష ఫలితాలు వస్తాయన్న సమాచారం అందినప్పటి నుంచి ఉత్తీర్ణత సాధిస్తానా..? లేదా..? అని ఆందోళనకు గురైంది. పనిమీద తల్లిదండ్రులు బయటకు వెళ్లడంతో ఇంట్లోనే ఫ్యానుకు చీరతో ఉరివేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


గౌతమి మృతదేహం

సంతానం కలగలేదని యువకుడు..

గోరంట్ల, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలేకుంటపల్లికి చెందిన హరీష్(30) సంతానం కలగలేదన్న మనస్తాపంతో బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ శేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాలేకుంటపల్లి ఆదినారాయణప్ప కుమారుడు హరీష్‌కు నాలుగేళ్ల క్రితం హిందూపురం మండలం కొట్నూరు గ్రామానికి చెందిన గాయత్రితో వివాహమైంది. అప్పట్నుంచి అత్తగారింట్లోనే ఉంటుండేవాడు. నాలుగేళ్లయినా సంతానం కలగకపోవడంతో మనస్తాపం చెందిన హరీష్ బుధవారం స్వగ్రామమైన కాలేకుంటపల్లికి వచ్చాడు. రాత్రికి ప్రత్యేక గదిలో నిద్రించిన అతడు పైకప్పునకు చీరతో ఉరేసుకుని, మరణించాడు. ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. అతడి భార్య గాయత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, శవాన్ని పెనుకొండకు తరలించి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


హరీష్ మృతదేహం

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం

గార్లదిన్నె, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుంపల్లి సమీపాన 44వ జాతీయ రహదారిపై గురువారం ద్విచక్రవాహనాన్ని లారీ వెనుక నుంచి ఢీకొనడంతో రైతు చిన్న చౌడప్ప (43) దుర్మరణం చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలు మేరకు... పామిడి మండలం వంకరాజు కాలువకు చెందిన చిన్న చౌడప్ప, సులోచన దంపతులు తమకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయంతోపాటు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. చిన్న చౌడప్ప అనంతపురం మార్కెట్‌లో దోస, మామిడి, కలింగర తదితర పండ్లను కొనుగోలు చేసుకుని, ఆటోలో గ్రామాల్లో విక్రయించుకునేవాడు. గురువారం ఉదయం ద్విచక్రవాహనంలో అనంతపురం మార్కెట్‌కు బయలుదేరాడు. కనుంపల్లి సమీపంలోకి వెళ్లగానే ఉత్తరప్రదేశ్ నుంచి బెంగళూరుకు టైల్స్ లోడుతో వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో చిన్న చౌడప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్‌ఐ మహమ్మద్ గౌస్‌బాషా ప్రమాదస్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకుని, డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.


చిన్నచౌడప్ప (ఫైల్)

న్యూస్ బాక్స్

నేటి నుంచి ఆధార్ క్యాంపులు : ఎంపీడీఓ

అనంతపురం రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం నుంచి నిర్వహించే ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ దివాకర్ పేర్కొన్నారు. ఆ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్ర, శనివారాల్లో ఎ. నారాయణపురం -1, 2, 4 సచివాలయాలు, రాజీవ్‌కాలనీ- 1 సచివాలయంలో క్యాంపులు జరుగుతాయన్నారు. అలాగే ఈ నెల 8వ తేది ఎ.నారాయణపురం- 3, 5 సచివాలయాలు, రాచానపల్లి, రాజీవ్‌కాలనీ- 2 సచివాలయాల్లో, 9వ తేది ఎ. నారాయణపురం-3,5, రాచానపల్లి, రాజీవ్‌కాలనీ-2 సచివాలయాల్లో క్యాంపులు ఉంటాయన్నారు. 10న ఎ. నారాయణపురం- 3, 5, రాచానపల్లి, రాజీవ్‌కాలనీ-2, 11న ఎ.నారాయణపురం-1, 2,4, రాజీవ్‌కాలనీ-1 సచివాలయాల్లో క్యాంపులు జరుగుతాయన్నారు.

సెలవులో ఉద్యాన శాఖ ఇన్‌చార్జ్ డీడీ

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఉద్యాన శాఖ ఇన్‌చార్జ్ డీడీ నరసింహారావు వ్యక్తిగత కారణాల నేపథ్యంలో నెలరోజులపాటు సెలవుపై వెళ్లారు. ప్రస్తుతానికి టెక్నికల్ హెచ్‌ఓ పల్లవికి డిపార్టుమెంట్ సెల్ అప్పగించి వెళ్లారు. ఇంకా ఇన్‌చార్జ్ డీడీగా ఎవరినీ నియమించలేదు.

ఎంసీపల్లిలో సమగ్ర భూరీసర్వే ప్రారంభం



సమగ్ర భూ రీసర్వేపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రామగిరి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంసీపల్లి రెవెన్యూ గ్రామంలో సమగ్ర భూ రీసర్వేను గురువారం ప్రారంభించారు. మొదట రీ సర్వేపై ర్యాలీ చేపట్టి అనంతరం గ్రామసభ నిర్వహించారు. భూ రీ సర్వేవల్ల రైతులకు ఎంతో ఉపయోగమని రైతులందరు సహకరించాలని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ నరేశ్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ పద్మ, వీఆర్‌ఓ కేశవ, సచివాలయ సర్వేయర్ వందన, మాజీ సర్పంచ్ ముత్యాలప్ప, వడ్డి వెంకటేశ్, పరంధామ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

పెరిగిన పంచాయతీ ఆదాయం

చెన్నేకొత్త.పల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతి మంగళవారం జరిగే వారపుసంతకు గురువారం అధికారులు వేలం పాట నిర్వహించారు. స్థానిక గ్రామ సచివాలయం-1లో నిర్వహించిన వేలం పాటకు నలుగురు డిపాజిట్ రుసుము చెల్లించి వేలం లో పాల్గొన్నారు. చెన్నేకొత్తపల్లికి చెందిన శ్రీధర్ రూ.4,09,900ను వారపు సంతను దక్కించు కున్నాడు. ఇది గత ఏడాది రూ.3.47లక్షలు పలికింది. దీంతో ఈ ఏడాది పంచాయతీకి రూ. 62,900 ఆదాయం వచ్చిందని పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అశోక్‌నాయక్, సర్పంచ్ ధనశ్రీ, టీడీపీ నాయకులు అంకే అమరేంద్ర, మాడెం సూర్యనారాయణరెడ్డి, వడ్డే దుర్గా, చెన్నేకేశవులగౌడ్, అమరేంద్రరెడ్డి, హరినాథరెడ్డి, శివ, రామాంజి, సూరి పాల్గొన్నారు.

మిట్స్ కళాశాల విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ తదితరులు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ అనుబంధ మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి జాతీయ సదస్సులో ప్రతిభను కనబర్చారని ప్రిన్సిపాల్ యువరాజ్ గురువారం ప్రకటనలో తెలిపారు. బీటెక్ డేటీ సైన్స్ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తున్న విద్యార్థి బాలజీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి హ్యాక్ ఫెస్టా- 2025లో బహుమతితో పాటు రూ. 15వేల నగదు పొందారని తెలిపారు. ఈ సందర్భంగా విభాగాధిపతి కుసుమ, కరెస్పాండెంట్ విజయభాస్కర్ చౌదరి, డైరెక్టర్ కీర్తి నాదేళ్ల అభినందించారని తెలిపారు.

ఎస్సీ హాస్టల్ స్థలాన్ని కాపాడండి: సాకే హరి

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఆక్రమణకు యత్నించిన వైసీపీ నాయకుల నుంచి ఉరవకొండలోని గాంధీ హరిజన హాస్టల్ స్థలాన్ని కాపాడాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ప్రభుత్వాన్ని కోరారు. ఆయన గురువారం నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఉరవకొండ పట్టణంలో కొన్ని దశాబ్దాల క్రితం విద్యార్థులకు విద్య, వసతి కి కేటాయించిన స్థలాన్ని వైసీపీ నాయకులు ఆక్రమించేందుకు యత్నించడంతో పోరాటాలుచేసి నిలువరించామని తెలిపారు. ఆ స్థలాన్ని పకడ్బందీగా ఆన్‌లైన్‌లో ఎక్కించి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, యల్లన్న, గుండ్రాయప్ప, గోపాల్, ఆనంద్ పాల్గొన్నారు.

చియ్యేడు పాఠశాలలో వాటర్ బెల్ కార్యక్రమం



విద్యార్థులకు వాటర్ బాటిళ్లు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ, శ్రీరాఘవేంద్ర ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో వాటర్ బెల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా వాటర్ బాటిళ్లు అందించినట్లు పాఠశాల హెచ్‌ఎం విజయ్‌కుమార్ తెలిపారు. జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్ విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్, మల్లికార్జున, ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి ప్రసిల్లా, శ్రీరాఘవేంద్ర ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి శివ, సభ్యులు రవీంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

అనంతలక్ష్మిలో నీటి వారోత్సవాలు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నీటి వారోత్సవాలను నిర్వహించారు. నీటి వాడకంపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటుచేసి వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్ రామకృష్ణారెడ్డి, ఐఈఈ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కళాశాల డీన్ రాయుడు, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ ఖలీల్‌భాష, ఏఓ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లకు బదులు... ముళ్లకంపల దర్శనం

- గత పాలకుల పాపం.. లబ్ధిదారులకు శాపం..
- కొడిమి లేఅవుట్‌లో నిలిచిన ఇళ్ల నిర్మాణం



కొడిమి లేఅవుట్‌లో ఏపుగా పెరిగిన ముళ్ల కంపలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): 'ఇల్లు కాదు..ఊళ్లను నిర్మిస్తున్నాం.' ఇది గత ప్రభుత్వ హయంలోని ప్రజాప్రతినిధులు చెప్పిన మాటలు. ఆ మాటలు నేడు నీటి మూటలు గా మారాయి. ఇందుకు కొడిమి గ్రామ సమీపంలోని లేఅవుట్ నిదర్శనంగా నిలుస్తోంది. ఇళ్లు వెలుస్తాయనుకున్న చోట. ముళ్ల కంపలు పెరిగాయి. కొని చోట్ల మొండిగోడలు కనిపిస్తున్నాయి. లేఅవుట్లు ఆ విధంగా దర్శన మివ్వడానికి గత పాలకులే కారణమన్న వాదనలు వినిస్తున్నాయి. పాలకులు సొంతలాభం కోసం కాంట్రాక్టర్ల అవతారమెత్తి, అందినకాటికి సొమ్ముచేసుకుని జేబులు నింపుకున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం మారింది. గత వైసీపీ పాలనలో ఇళ్ల నిర్మాణాలలో జరిగిన అక్రమాలపై ప్రస్తుత ప్రభుత్వం ఎంక్వైరీకి ఆదేశించింది. గత పాలకుల అక్రమాలతో పేదల సొంతింటి కల కలగానే మిగిలిపోయింది. వారి పాపమే..లబ్ధిదారులకు ఇళ్లకు బదులు, ముళ్ల కంపలను, చెట్లను, మొండిగోడలను బహుమతిగా ఇచ్చినట్లయింది.

నిర్మాణాలు పూర్తికాకుండానే బిల్లులు..

గత ప్రభుత్వ హయాంలో పేదలందరికీ ఇళ్లు-వైఎస్సార్ జగనన్న కాలనీల పేరిట కొడిమిగ్రామ సమీపంలో భూములు సేకరించారు. సర్వే నెంబర్లు 54పి, 255పి, 256పి, 257, 258, 259, 260, 261పి పరిధిలో దాదాపు 80ఎకరాలకు పైగా భూమి సేకరించారు. ఇందులో అనంతపురం నగరంతో పాటు ఎ.నారాయణపురం, కక్కలపల్లి కాలనీ, కొడిమి, పాపంపేట తదితర ప్రాంతాల్లోని 3,500 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారు. అయితే భూ సేకరణ సమయంలో చెప్పిన విధంగా పరిహారం ఇవ్వకపోవడంతో కొందరు రైతులు కోర్టును ఆశ్ర యించారు. కోర్టులో ఉన్న భూముల్లో మినహా మిగిలిన వాటిలో ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. కోర్టుకు వెళ్లిన వారికి గత పాలకులు హామీ పత్రాలు ఇచ్చి చేతులుదులుపుకున్నారు. మిగిలిన వారి భూముల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. నిర్మాణ బాధ్యతలను అప్పటి ప్రజాప్రతినిధి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కుటుంబ సభ్యులకు సంబంధించిన రాక్రీట్ సంస్థ తీసుకుంది. బాధ్యతలు తీసుకోవడంలో ఉన్న స్పీడు.. ఇళ్ల నిర్మాణంలో కనిపించలేదు. స్థానికంగా లేఅవుట్‌ను పరిశీలిస్తే ఎవ్వరికైనా ఆ విషయం అర్థమతుంది. ఇళ్ల నిర్మాణాల్లో జరిగిన పనికంటే ముందుగానే కాంట్రాక్టు సంస్థ బిల్లులు చేసుకుని పబ్బం గడుపుకుంది. పేదలకు మాత్రం సొంతింటి కలను కలగానే మిగిల్చారు.

పునాదుల్లో ముళ్లకంపలు మొలిచాయి

గత పాలకుల చేసిన తప్పిదాలతో స్థానికంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో లేఅవుట్ అంతా మొండిగోడలు, ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. మొండిగోడల చుట్టూ ముళ్లకంపులు ఏపుగా పెరిగిపోయాయి. ఇళ్ల నిర్మాణాలు జరగని ప్లాట్ల లో పిచ్చిమొక్కలు కనిపిస్తున్నాయి. ఇక పునాదుల్లో ముళ్ల కంపలు, చెట్లు పెరిగిపోతున్నాయి. అటుగా వెళ్లినవారికి ఎవరికైనా ఇది స్పష్టంగా కనిపిస్తుంది. రూ. కోట్లు ఖర్చు చేసి..పేదలకు ఇళ్లకు బదులు ముళ్ల కంపలను ఇచ్చారంటూ పెదవిరుస్తున్నారు. సాధారణంగా ఇళ్ల నిర్మాణం పూరైతే వాటి ఎదుట పెంచుకోవడానికి మొక్కలను ఇస్తుంటారని, నాటి పాలకులు భిన్నంగా ఇళ్లకు బదులు, పిచ్చిమొక్కలు ఇచ్చినట్లుందని కొందరు మాట్లాడుకుంటున్నారు.



లేఅవుట్‌లో మొండిగోడలకు పరిమితమైన ఇళ్లు

డీలర్లకు సక్రమంగా బియ్యం సరఫరా చేయాలి

- బఫర్‌తో సంబంధం లేకుండా అందించాలి
- అధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బఫర్‌తో సంబంధం లేకుండా డీలర్లకు రేషన్ బియ్యం సరఫరా చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆమె గురువారం సాయంత్రం నగరంలోని క్యాంపు కార్యాలయంలో శ్రీసత్యసాయి, అనంతపు రం జిల్లాలకు సంబంధించిన పౌరసరఫరాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులతో చర్చించారు. గత ప్రభుత్వంలో బఫర్ పెండింగ్‌లో ఉంచడం వల్ల ఆ ప్రభావం తమపై పడుతోందని ప్రస్తుతం ఉన్న డీలర్లు ఇటీవల ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకొచ్చారు. ప్రతినెలా బఫర్ స్టాకు పేరుతో రేషన్ బియ్యం బస్తా మీద నాలుగు నుంచి ఐదు కేజీలకుపైగా తక్కువగా వస్తున్నాయని తక్కువగా సరఫరా చేస్తున్నారని ఇలాగైతే ప్రజలకు ఎలా పంపిణీ చేసేదని వాపోయారు. ఇదే అంశాలను అధికారులతో ఆమె చర్చించారు. బియ్యం తక్కువ ఇస్తే డీలర్లు కూడా లబ్దిదారుకులు సరిగా అందించలేరని అంతిమంగా అది ప్రజలపై ప్రభావం పడుతుంద న్నారు. స్టాక్ పాయింట్లలో తూకాలు కచ్చితంగా ఉండాలని, ఎవరైనా మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎండీయూ వాహనదారులకు ప్రతినెల డబ్బులు చెల్లిస్తున్న ప్పటికి ఇంటింటికి రేషన్ సరఫరా చేయకపోవడం వంటి అంశాలపైనా చర్చించారు. ఈ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉండటంతో తాము ఉన్నతాధికారులకు, పౌరసరఫరాల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే అన్నారు. త్వరలో కొత్త రేష్‌కార్డులు వస్తాయని, అర్హులైనా అందరికీ రేషన్‌కార్డులు అందేలా చూడాలన్నారు. ఇప్పటి వరకు ఈకేవైసీ చేయించుకోని రేషన్‌కార్డుదారులు ఖచ్చితంగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడిజిల్లా డీఎస్‌ఓలు, డీఎంలు, ఆరు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సీఎస్‌డీటీలు, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీలకు టీడీపీ జిల్లా అధ్యక్షుడి శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ బీద రవిచంద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎమ్మెల్సీలుగా ఎన్నికైన బీద రవిచంద్ర యాదవ్, బీటీనాయుడుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన గురువారం విజయవాడలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో వారిని కలిశారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆర్థిక శాఖ మంత్రిని కలిసిన సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు

ఉండవల్లిలోని సచివాలయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను గురువారం టీడీపీ సీనియర్ నాయకులు, కూడేరు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు గుడిపూటి సురేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలను ఆయన మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

'విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి'

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని సీనియర్ కార్డియా లజిస్టు డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. జనవిజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం పాతూరులోని ప్రశాంతి విద్యానికేతన్ హైస్కూల్‌లో నిర్వహించిన సదస్సుకు డాక్టర్ వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ.. శాస్త్రీయ దృక్పథం కలిగిన సమాజ నిర్మాణంలో జేవీవీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో తరిమెల అమరనాథరెడ్డి, సలీం, స్కూల్ యాజమాన్యం ఎన్‌ఎం ఇక్బాల్, షమీం, జేవీవీ నగర నాయకులు రామిరెడ్డి, తిరుపాల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

గార్లదిన్నె, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో క్రిష్ణం నాయుడు అనే రైతుకు చెందిన గడ్డి వాము దగ్ధమైంది. రైతు క్రిష్ణం నాయుడు తన పొలంలో సుమారు నాలుగు ట్రాక్టర్ల గడ్డిని పశువుల మేత కోసం ఇంటి వద్ద వాము వేసుకున్నాడు. అయితే గురువారం గడ్డివాములో మంటలు వ్యాపించాయి. గమనించిన రైతుతో పాటు చుట్టు పక్కల వారు మంటలను ఆదుపు చేసేందుకు ప్రయత్నం చేశారు. అగ్నిమాపక శాఖ అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను ఆదుపు చేశారు. కొంతమేర గడ్డివాము కాలిపోయింది. దీంతో సుమారు రూ.50వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

శ్రీరామనవమి ఉత్సవ పోస్టర్ల ఆవిష్కరణ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసనగర్‌లోని సీతా రామాంజనేయ స్వామి దేవాలయంలో ఈనెల 6వ తేదీన నిర్వహించ నున్న శ్రీరామనవమి వేడుకలకు సంబం ధించిన పోస్టర్లను గురువారం ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రాము మాట్లాడుతూ... ప్రతియేడాదిలాగే ఉత్సవాలను వైభవంగా నిర్వహించ నున్నట్లు తెలిపారు. 6న ఉదయం సుప్రభాత సేవ, అనంతరం సీతారాముల కల్యాణం, సాయంత్రం స్వామివార్ల నగరోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాంప్రసాద్, రామ్మూర్తి, మహేంద్ర, ప్రసాద్, అనీల్, ముఖేష్, శ్రీనివాసులు, శివ, సురేష్, ప్రకాష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణపై చర్యలు తీసుకోండి

- టీడీపీ నాయకులు

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించుకున్న వారిపై వెంటనేచర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు అధికారులను కోరారు. నరసింగ రాయనిపల్లి, ఆమిదాలకుంట గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు మల్లికార్జున, యజ్ఞేశంకర్, నారాయ ణస్వామి, మురళి, కుళ్లాయప్ప, గంగాధర్, రామాంజినేయులు గురువారం టీడీపీ స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కనుముక్కల రెవెన్యూ పరిధిలోని నరసింగరాయనిపల్లి సమీపంలో సర్వే నెంబరు 295-2లో 5.28ఎకరాలు, 301-2లో 1.98ఎకరాలు, 397లో 2.24 ఎకరాలు భూమిని కొందరు వైసీపీ నాయకులు ఆక్రమించుకుని అక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని ఆరోపించారు. అదేవిధంగా ఆమిదాల కుంటలో సర్వేనంబరు 409-5లో 6.62ఎకరాలు ప్రభుత్వభూమి ఉందని, అయితే 409-5ఏగా మార్పు చేసి 3. 50ఎకరాల రస్తా భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నారన్నారు. దీంతో రైతులకు పొలాలకు వెళ్లే రస్తా లేకపోవడంతో ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. కావున అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని, వాటిని గ్రామ అవసరాలకు కేటాయించాలని వారు కోరారు.

సభ్యత్వ నమోదుతో భరోసా

కనగానపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదుతో బాధిత కుటుంబాలకు ఆర్థికంగా భరోసా వస్తుందని రాప్తాడు నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ సుధాకర్‌చౌదరి తెలిపారు. కనగానపల్లిలోని పరిటాల భవన్‌లో గురువారం టీడీపీ సభ్యత్వ కార్డులను బూత్ ఇన్‌చార్జ్‌లకు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 12వేలకుపైగా సభ్యత్వం నమోదు చేసుకున్నారని వారందరికీ పార్టీ కార్యాలయం నుంచి కార్డులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ యాతం పోతులయ్య, నెట్టెం వెంకటేష్, అంకె రామకృష్ణ, తెలుగు యువత బట్టా సురేష్ చౌదరి, పూజారి రాజాకృష్ణ, బిల్లే దాము, బాలయ్య, వన్నూరప్ప, నాగభూషణం, రవి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల వెరిఫికేషన్‌లో వసతులు శూన్యం

- కనీసం తాగునీరు ఏర్పాటు చేయని వైనం




ఆసుపత్రిలో వెరిఫికేషన్‌కు హాజరైన పింఛన్ లబ్ధిదారులు

శింగనమల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలో పింఛన్ల వెరిఫికేషన్ సందర్భంగా దివ్యాంగులకు కనీసం తాగునీరు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించినట్లు పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. శింగనమల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం దివ్యాం గుల పింఛన్లకు సంబంధించి వెరిఫికేషన్ నిర్వహించారు. వెరిఫికేషన్ కోసం మండలంలోని 50 మందికి నోటీస్‌లు జారీ చేయడంతో ఉదయం 10 గంటలకే దివ్యాంగులు ఆసుప్రతికి చేరుకున్నారు. వెరిఫికేషన్ చేసే డాక్టర్ మధ్యాహ్నం 2 గంటలు అయినా రాలేదు. వెరిఫికేషన్ కోసం వచ్చిన దివ్యాంగులకు అక్కడ కనీసం నీటి సౌకర్యం కల్పించలేదు. మజ్జిగ ప్యాకెట్ అందజేయలేదు. అయినా పించన్‌దారులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అక్కడే పడిగాపులు కాచి వెరిఫికేషన్ పరీక్షలు చేయించుకున్నారు. వెరిఫికేషన్ కేంద్రాల వద్ద పించన్ దారులకు వసతులు కల్పించే బాధ్యత వెలుగు సమాఖ్య వారిదే అని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే డీఆర్‌డీ శాఖకు సంబంధించిన ఒక్క అధికారి కూడా వెరిఫికేషన్ కేంద్రాల వద్దలేరు. వెరిఫికేషన్‌కు వచ్చిన పింఛన్‌దారులకు ఆసుపత్రి నీరు అందించామని వైద్యాధికారి రోహి నాథ్ తెలిపారు. కనీస వసతులు లేకపోవడంతో ఉదయం నుంచి మధ్యా హ్నం వరకు ఉండి అలసిపోయామని పింఛన్‌దారులు ఆవేదన చెందారు.

బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు

- రామగిరి సీఐ శ్రీధర్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సర్కిల్ పరిధిలో బెట్టింగులు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని రామగిరి సీఐ శ్రీధర్ పేర్కొన్నారు. బెట్టింగ్ జోలికి ఎవరూ వెళ్లొద్దని, ఎవరైనా నిర్వహించినా, ప్రోత్సహించినా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే గత ఐదారేళ్లకు సంబంధించి డేటా తీసుకుని వివరాలు సేకరిస్తున్నామని సీఐ తెలిపారు. పోలీసు నిఘా నుంచి ఎవరూ తప్పించుకోలేరని ఆయన స్పష్టం చేశారు.

ప్రశ్న: శాంతిభద్రతల పరిరక్షణకు ఏం చర్యలు చేపట్టారు?

జవాబు: లా అండ్ ఆర్డర్ విషయంలో చాలా గట్టిగా ఉన్నాం. శాంతిభద్రతలకు విఘాతం కల్గించాలని చూసేవారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇస్తున్నాం. సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయి.

ప్రశ్న: రోడ్డు ప్రమాదాల నివారణకు...?

జవాబు: చాలా మంది రాంగ్ రూట్‌లో వెళ్తుండటం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు భద్రత గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై మీ చర్యలేమి?

జవాబు: ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించాం. ట్రాఫిక్ రూల్స్ గురించి ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. వాహనాలు తనిఖీ చేస్తూ, నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధిస్తున్నాం.

ప్రశ్న: చోరీలకు ఎలా అడ్డుకట్ట వేస్తున్నారు?

జవాబు: గ్రామాల్లో చోరీలు కొంతమేర తగ్గాయి. అయితే రైతులకు సంబంధించిన పొలాల్లో వ్యవసాయ పరికరాలు, మోటార్లు చోరీకి గురవుతున్నాయి. రైతులను అప్రమత్తం చేయడంతో పాటు పోలీసుల నిఘా ఉంచాం.

అకాల వర్షంపై అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నగరంలో అకాల వర్షంపై నగర పాలక సంస్థ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తం కావాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో ఆయన ఫోన్ ద్వారా మాట్లాడారు. మూడు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో సంబంధిత అధికారులతో పాటు టీడీపీ స్థానిక నాయకులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల నుంచి చిన్న ఫిర్యాదు వచ్చినా స్పందించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తన వ్యక్తిగత కార్యదర్శులు శ్రీరాములు, శ్రీధర్ సెల్ ఫోన్ నంబర్లు 9000900821, 7337225834కు ఫోన్ చేయాలని సూచించారు.

ఒక్క ఫోన్ కాల్‌తో స్పందించిన ఎమ్మెల్యే

అనంతపురం నగరంలో గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి 39వ డివిజన్‌లో ఇళ్ల మధ్యలో వర్షపు నీటి నిల్వతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో స్థానికులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి సమాచారం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే టీడీపీ నాయకులు గంగారామ్, చేపల హరిని అక్కడికి పంపించి సమస్యను పరిష్కరించేలా చేశారు. దీంతో స్థానిక నాయకులు ఎమ్మెల్యేకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎన్నికల ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్ సూచన

అనంతపురంటౌన్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియకు రాజకీయపార్టీలు పూర్తిస్థాయిలో సహకరించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ కోరారు. కలెక్టరేట్‌లో గురువారం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతినెలా పార్టీలతో సమావేశాలు నిర్వహించి, అభిప్రాయాలు తీసుకోవాలని కమిషన్ ఆదేశించిందన్నారు. ఎన్నికల ప్రక్రియలో అత్యంత ముఖ్యమైన వాటాదారులు రాజకీయపార్టీలేనని, ఎన్నికల ప్రక్రియను పటిష్టం చేయడానికి సలహాలు ఇవ్వాలని సూచించారు. ఓటర్ల జాబితాలో, తొలగింపులు, మార్పులు, నమోదు తదితర వాటి గురించి నాయకులు అడుగగా కలెక్టర్ సమాధానాలిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, ఎన్నికల విభాగపు అధికారి యుగేశ్వరి, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

తండాల అభివృద్ధికి ప్రజల సహకారం అవసరం

ఎస్టీ కార్పొరేషన్ ఈడీ రామాంజనేయులు

శింగనమల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం తండాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించిందని, అందుకు స్థానికుల సహకారం అవరమని జిల్లా ఎస్టీ కార్పొరేషన్ ఈడీ రామాంజినేయులు పేర్కొన్నారు. శింగనమల మండలంలోని నాగులగుడ్డం తండా కేంద్ర ప్రభుత్వం మోడల్ గ్రామంగా ఎంపికైంది. దీంతో మండలస్థాయి అధికారులు గురువారం ఆ తండా వాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఈడీ రామాంజనేయులు మాట్లాడుతూ.. తండాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిడడానికి ప్రత్యేక నిధులు రానున్నట్లు తెలిపారు. తండా అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై స్థానికులతో చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య, ఎంపీడీఓ భాస్కర్, సీడీపీఓ ఉమాశంకరమ్మ, ఏఓ అన్వేష్‌కుమార్, రవీంద్రరెడ్డి తదిరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల రైతులకు సబ్సిడీ రుణాలివ్వాలి

- జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు చిన్నప్పయాదవ్



రాష్ట్ర సదస్సు కలరపత్రాలను అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

నార్పల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పండ్లతోటల రైతులకు అధిక సబ్సిడీతో రుణాలు ఇచ్చి ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు దఫేదార్ చిన్నప్పయాదవ్ పేర్కొన్నారు. మండలంలోని బండ్లపల్లి, పప్పూరు, బొందలవాడ గ్రామాలలో ఉద్యాన పంటలను రైతు సంఘం నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టుల నిర్వీర్యం వలన చివరి ఆయకట్టు వరకు నీరందక బావులు, బోరుబావులు, ఎండిపోతున్నాయని అన్నారు. అలాగే ఉద్యాన పంటలకు సబ్సిడీలు ఇచ్చే విషయంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ హాల్‌లో ఈ నెల 8న రాష్ట్ర స్థాయి ఉద్యాన పంటల రైతుల సదస్సుకు రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి లలితమ్మ, నాయకులు సంజీవరాయుడు, ఈశ్వరయ్య, కుళ్లాయప్ప, లక్ష్మీదేవి, రామాంజినమ్మ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉరుముల శబ్దానికి మూడు ఆవుల మృతి

నార్పల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పిడుగు పాటి వంటి ఉరుముల శబ్దానికి గవ్వల వీధిలో మూడు ఆవులు మృతి చెందాయి. గవ్వల వీధికి చెందిన షైలురాజు ఎర్రనాగప్ప రేకుల షెడ్‌లో ఆవులను కట్టేశాడు. ఇదే క్రమంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి భారీ ఉరుముల శబ్దానికి మూడు ఆవులు మృతి చెందాయి. దీంతో రూ.3లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని కాలనీ వాసులు కోరారు.

ఐపీఎల్ హోరు .. బెట్టింగ్ జోరు..!

● గ్రామాలకూ పాకిన వైనం
● సర్వం కోల్పోతున్న యువత



డీ.హీరేహాళ్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో క్రీడలు ఉన్నాయి. కానీ క్రికెట్‌కు ఉన్న ప్రత్యేకత వేరు. ఇండియాలో క్రికెట్‌కు ఉన్న క్రేజీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. క్రికెట్‌క్రీడపై చిన్న పిల్లల నుంచి ముసలివారి వరకు ఎంతో ఆసక్తిగా ఈ క్రీడను చూస్తుంటారు. కానీ ఇదంతా నాణేనికి ఒక వైపు మాత్రమే. మరో వైపు ఐపీఎల్ పేరిట బెట్టింగ్ వ్యవహారం చాపకింద నీరులా వ్యాపిస్తోంది. బెట్టింగ్‌కు చిన్నా పెద్ద అనే తేడా లేదు. మరీ ముఖ్యంగా యువకులు బెట్టింగ్‌కు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కొందరు ఈజీ మనీకి అలవాటుపడి సర్వం కోల్పోతున్నారు. క్రికెట్ ప్రేమికులు వ్యసనాన్ని, బలహీనతలను ఆసరాగా చేసుకుని బెట్టింగ్ ముఠాలు విచ్చలవిడిగా పందేలకు పాల్పడుతున్నాయి. ఈ ఏడాది రెండు నెలల పాటు పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఎంతో ఉత్కంఠగా సాగుతున్నాయి. గతంలో ఈ ఆటకు పెద్ద పెద్ద నగరాలలో మాత్రమే బెట్టింగులు కాసేవారు. కొన్ని సంవత్సరాలుగా ఈ భూతం పల్లెలకు కూడా పాకింది. ఈ బెట్టింగ్ భూతంలో జీవితాలను కొంతమంది బుగ్గిపాలు చేసుకుంటున్నారు. క్రికెట్‌ను వినోదంగా చూడాల్సింది పోయి లక్షల రూపాయలు వెచ్చించి యువకులు, ముసలివాళ్లు ఈఆటపై బెట్టింగులు కాస్తున్నారు. ఈ ఉచ్చులో పడి ఎంతో మంది జీవితాలను నాశనం చేసుకున్నారు. వినోదాన్ని పంచే ఐపీఎల్ కొన్ని కుటుంబాల్లో విషాదాలను నింపుతున్నాయి. మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో బెట్టింగ్ వ్యవహారం కొనసాగుతునే ఉంది. బెట్టింగ్‌పై చర్యలు తీసుకోవడానికి తగిన ఆధారాలు లేకపోవడం, ఫిర్యాదులు రాకపోవడం తదితర కారణాలతో పోలీసులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. బంతి బంతికి ఉత్కంఠ, మ్యాచ్ జరిగే సమయాల్లో ఆ ఆటకు సంబంధించి పరిస్థితులను బట్టి బంతి బంతికి మారే ఫలితాలను బట్టి అప్పటికపుడు బెట్టింగ్‌లో రేటు ఉంటుంది. మ్యాచ్ ప్రారంభంలోని మొదటి బంతికే సిక్స్ కొడతారని ఒకరు వికెట్ పోతుందని ఒకరు బెట్టింగులు కాస్తారు. ఇలా మ్యాచ్ ప్రారంభం నుంచి ముగిసే వరకు ఎన్నో రకాలుగా బెట్టింగ్ నిర్వహణ జరుగుతంది. మ్యాచ్ జరిగే సమయాల్లో బెట్టింగ్ సంబంధించి ఫోన్ పే, గూగుల్‌పే ద్వారా రేటింగ్‌ను బట్టి బుకీలతో బెట్టింగులు కాస్తారు. ఇలా ప్రతిరోజూ మండల వ్యాప్తంగా చాలా మంది యువకులు బెట్టింగ్ రూపంలో లక్షల రూపాయలు పోగొట్టుకుంటున్నారు.



బెట్టింగ్‌పై నిరంతరం నిఘా



ఐపీఎల్ సీజన్ ప్రారంభం నుంచి ముగింపు వరకు ప్రతిరోజూ గ్రామాలలో బెట్టింగ్ నిర్వహణపై నిఘా ఉంచుతున్నాం. సిబ్బందితో టీములుగా ఏర్పాటు చేసి గ్రామాలలో పర్యటిస్తున్నాం. అందిన సమాచారం మేరకు గుంపులుగా క్రికెట్‌ను తిలకిస్తున్న ప్రదేశానికి వెళ్లి స్వయంగా పరిశీలిస్తున్నాం. ప్రతిరోజూ గ్రామాలలో యువకులతో సమావేశం ఏర్పాటు చేసి బెట్టింగ్ వల్ల జరిగే అనర్థాల గురించి అవగాహన కల్పిస్తున్నాం.

-గురుప్రసాద్‌రెడ్డి, ఎస్ఐ

న్యూస్ బాక్స్

ప్రజాసమస్యలపై సత్వర చర్యలు



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై సత్వర చర్యలు చేపట్టినట్లు మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవాని, టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి పేర్కొన్నారు. గురువారం ఉదయం పట్టణంలోని 21వ వార్డులో రూ.76 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణానికి పనులను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ధర్మవరం గేటు వద్ద ఆర్‌యూబీ నిర్మించే పనులను రైల్వే శాఖ చేపట్టనుండగా, తాగునీటి పైప్‌లైన్‌ను తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పైప్‌లైన్‌ను డైవర్టు చేస్తే తప్ప వంతెన పనులు చేపట్టలేమని రైల్వే ఇంజనీరింగ్ అధికారులు తెలపడంతో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సత్వరమే చర్యలు తీసుకున్నారన్నారు. భూ పరిహారాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు ఇప్పించారని ధన్యవాదాలు తెలిపారు. నాయకులు బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, కృపాకర్, ప్రభాకర్, హనుమంతు, వీరేశ్, చిప్పగిరి ప్రతాప్ పాల్గొన్నారు.

ఘనంగా పోతురాజు గావు ఉత్సవం



పోతురాజు గావును ఊరేగిస్తున్న భక్తులు

గుమ్మఘట్ట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగచేడు గ్రామంలో గురువారం సాయంత్రం పోతురాజుగావును ఘనంగా నిర్వహించారు. రెండురోజుల పాటు గ్రామంలో మారెమ్మదేవత జాతర సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గుమ్మఘట్ట పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మొక్కజొన్న పంట పరిశీలన

బెళుగుప్ప, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులెన్న గ్రామానికి చెందిన రైతు మల్లికార్జున మొక్కజొన్న పంటను గురువారం వ్యవసాయ శాస్త్రవేత్తలు స్థానిక పృథ్వీసాగర్‌తో కలసి పరిశీలించారు. రైతు మల్లికార్జున ఆరు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేయగా నాసిరకం విత్తనాలతో దిగుబడి రాలేదని వారం క్రితంకు ఫిర్యాదు చేయడంతో స్పందించి శాస్త్రవేత్తలు దృష్టికి తీసుకెళ్లారు. శాస్త్రవేత్తలు మాధవీలత, లక్ష్మణ్ణ, కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన ప్రధాన శాస్త్రవేత్త చెంగలరాయుడు, ఏడీ యల్లప్ప పరిశీలించారు. తోటలోని మట్టిని నీటిని సేకరించి ల్యాబ్ పంపి నివేదికలను జిల్లా అధికారికి అందజేస్తామన్నారు. సర్పంచ్ రాము, వ్యవసాయాధికారి తులసీ పాల్గొన్నారు.

7న ఫౌండేషన్ కోర్సు ప్రారంభం

బొమ్మనహాళ్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు 7వ తేదీ నుంచి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫౌండేషన్ కోర్సు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులకు అడ్మిషన్లు ప్రారంభం అవుతాయన్నారు. పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు ఆధార్, 10వ తరగతి హాల్‌టిక్కెట్, ఫోటోలతో కళాశాలనుసందర్శించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతు కూలీలు

గుత్తి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పత్తి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ రైతు కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలనువెంటనే అమలు చేయాలి, అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20వేలు పెట్టుబడి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు లలితకు వినతి పత్రం అందజేశారు. మండల కార్యదర్శి రాజశేఖర్‌శెట్టి, దస్తగిరమ్మ, లక్ష్మి, ప్రహ్లాద, రాజు పాల్గొన్నారు.

యాదవ ఫెడరేషన్ డైరెక్టర్‌కు సన్మానం



ఆమ్లెట్ మస్తాన్ యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యాదవ ఫెడరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఆమ్లెట్ మస్తాన్ యాదవ్‌కు గురువారం సాయంత్రం ఆయన స్వగృహంలో నగర డోనా గ్రామ యాదవ్ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఆయనకు శాలువ కప్పి పూలమాలతో సత్కరించారు. అనంతరం ఆయన చేత కేక్ కట్ చేయించారు. నాయకులు, కార్యకర్తలు, యాదవ్‌సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఏపీఎస్‌ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎంయూఏ డిపో కార్యదర్శి తిప్పేస్వామి డిమాండ్ చేశారు. న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరిచాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం రెండురోజులు ఎర్రబ్యాడ్జీల ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. రీజనల్ సహాయ కార్యదర్శి ఎం సిద్దేశ్వర, దామోదర్, ప్రెసిడెంట్ జిలాన్,గ్యారేజ్ కార్యదర్శి సతీష్‌కుమార్, పీరా, డెలిగేట్ నాగరాజు, యోగేంద్రకుమార్ పాల్గొన్నారు.



ఎర్రబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

యల్లనూరు, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవీ పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. 6వ తరగతిలో 40సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 సీట్లు ఉన్నాయన్నారు.

దోబీఘాట్ వద్ద బోరు ఏర్పాటు

విడపనకల్లు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ కొట్టాల గ్రామంలో రజకుల కోసం టీడీపీ నాయకులు బోరును వేయించారు. మంత్రి ఆదేశాలతో ఆర్ కొట్టాల గ్రామంలో బోరును వేయించినట్లు గురువారం నాయకులు తెలిపారు. వేసవి కాలం కావడంతో పెద్ద తుమ్మల వంక ఎండిపోయింది అన్నారు. రజకులు బట్టలు ఉతికేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బోరును వేయించి నీటిని వదులకునే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

పౌరసరఫరాల గోదాము తనిఖీ

ఉరవకొండ,ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయమార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న పౌరసరఫరాల గోదామును అనంతపురం ఆర్డీవో కేశవనాయుడు గురువారం తనిఖీ చేశారు. స్టాక్‌పాయింట్‌లోని రికార్డులను పరిశీలించారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దారు మహబూబ్‌బాషా, స్టాక్ పాయింట్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, ఆర్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

తాడిపత్రి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ ప్రవేశపరీక్షకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ హరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2వ తేదీ నుంచి కళాశాలలోనే శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు తెలిపారు. శిక్షణా కాలంలో స్టడీమెటీరియల్ కూడా అందజేస్తామని తెలిపారు. 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 30న ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 7901620198 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆనలుగురు సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్ మాట్లాడుతూ పాతబస్టాండ్‌లోని చింతమాను వద్ద 50 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తమకు సమాచారం అందించారన్నారు. ఉపాధ్యక్షుడు రవీంద్ర, సభ్యులు లింగేశ్వర్, అంజి, రత్నమ్మ, ఈరమ్మ, బాబు పాల్గొన్నారు.

రేషన్‌షాపు సీజ్

పుట్లూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపరాజుపల్లి గ్రామంలో రేషన్‌షాపు సీజ్‌చేసినట్లు గురువారం విజిలెన్స్ సీఐ సద్గురుడు తెలిపారు. పత్రాల్లో కేటాయించిన చోట రేషన్‌షాపు లేదన్నారు. సరుకులు తనిఖీ చేయగా రెండు ప్యాకెట్ల కందిబేడలు అధికంగా ఉన్నాయన్నారు. షాపులోని పలు రిజిస్టర్‌లను పరిశీలించారు. తనిఖీలో అధికారి వాసుప్రకాష్, హెడ్‌కానిస్టేబుళ్లు చలంబాబు, విజయ్, వీఆర్వో నరేంద్ర ఉన్నారు.

మజ్జిగ పంపిణీ

కుందుర్పి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రంతోపాటు ప్రతి గురువారం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు సునీత గీతారాణి, నాగవేణి ఆధ్వర్యంలో మజ్జిగ అందించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం గ్రామంలో క్రికెట్ జూదంలో ఇద్దరు వ్యక్తుల మధ్య రూ.వెయ్యి కోసం చోటు చేసుకున్న చిన్నపాటి గొడవ ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. ఈశ్వర్‌రెడ్డి, తిప్పయ్య గొడవ పడ్డారు. దీంతో ఈశ్వర్‌రెడ్డి వర్గానికి చెందిన గంగిరెడ్డి, నరేష్, హనుమంతరెడ్డి, యోగానందరెడ్డి, చంద్రశేఖర్, వెంకటరెడ్డి, సంజీవరెడ్డి, బ్రహ్మయ్యలపై తిప్పయ్య వర్గానికి చెందిన తిప్పయ్యతో పాటు చిన్న తిప్పయ్య, వన్నూరుస్వామి, ప్రభాకర్, సుధాకర్, లింగప్ప, తిమ్మరాజు, ప్రసాద్, తిప్పక్కపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

గుత్తి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గుత్తిరైల్వే స్టేషన్ బుకింగ్ కార్యాలయం వద్ద పార్క్ చేసి హోండా షైన్ ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు రైల్వే స్టేషన్ మేనేజరు సురేష్‌బాబు, పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. విధి నిర్వహణలో భాగంగా బుకింగ్ కార్యాలయం ఎదుట ద్విచక్రవాహనాన్ని నిలపగా గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి చోరీ చేశారన్నారు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మంపల్లిలో..

శెట్టూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మంపల్లి గ్రామంలో బుధవారం రాత్రి వైశ్య నాగేంద్ర ప్రసాద్ అనే వ్యక్తి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు రూ.20 వేలు నగదు ఎత్తుకు వెళ్లినట్లు గురువారం పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో ఎక్కడ చేసినా పేకాట క్రికెట్ బెట్టింగ్‌లు అధికమవడంతోనే పలువురు వ్యక్తులు చోరీలకు పాల్పడుతున్నట్లు గ్రామ ప్రజలు తెలిపారు.

కేబుల్ వైరు..

పుట్లూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి):మండలంలోని మడ్డిపల్లి గ్రామంలో గురువారం వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు కట్‌చేసి ఎత్తుకెళ్లారు. నలుగురు రైతులకు సంబంధించిన మోటార్ల వద్ద కేబుల్ వైరును ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు తెలిపారు. ఆగ్రామంలో గత వారంలో 14మంది రైతులకు చెందిన కేబుల్‌వైర్లను ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. పోలీసులు నిఘా పెంచి చోరీలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

నేడు, రేపు వర్ష సూచన

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం, శనివారం రెండురోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని తహసీల్దార్ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణశాఖ హెచ్చరిక మేరకు రెండురోజుల పాటు ఉరుములు, మెరుపులతో పాటు అధిక గాలులు వీచే అవకాశం ఉందన్నారు. వర్షం పడే సమయంలో ఎవరూ పొలాల వద్ద ఉండకూడదని, సురక్షిత ప్రాంతాలలో ఉండాలని సూచించారు.

రైతుసేవా కేంద్రాల తనిఖీ

పుట్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్లూరు, కోమటికుంట్ల, కడవకల్లు రైతుసేవా కేంద్రాలను గురువారం జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆకస్మికంగా తనిఖీచేశారు. రైతు నమోదును త్వరితగతిన పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఏడీఏ చెంగళరాయుడు, మండల వ్యవసాయ అధికారి కాత్యాయిని, ఏఈఓ హరి, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటపై అడవిపందుల దాడి

బొమ్మనహాళ్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన రైతన్నకు ఏదో ఒక రూపంలో నష్టాలు తప్పడం లేదు. దుక్కి దున్ని విత్తనం వేసి పంట చేతికొచ్చే వరకు కంటికి రెప్పలా కాపాడుకుంటే అడవి పందుల రూపంలో పంటను ధ్వంసం చేసి రైతుకు తీరని నష్టాన్ని మిగులుస్తున్నాయి. మండలంలోని నేమకల్లు గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి, పొంపాపతి, చంద్ర, తిప్పన్న తదితర రైతులు 20 ఎకరాలలో మొక్కజొన్న పంటను సాగుచేశారు. పంటపై అడవి పందులు బీభత్సం సృష్టించాయి. ఒక్కో రైతు పొలంలో అర ఎకరానికి పైగా ధ్వంసం చేయగా ఆ రైతులు విలవిల్లాడిపోతున్నారు. కష్టపడి పండించిన పంటను ఒక్కసారిగా అడవి పందులు ధ్వంసం చేయడంతో ఆవేదనను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. వ్యవసాయశాఖ అధికారులకు తెలియజేస్తే తమకు సంబంధం లేదని అటవీశాఖ అధికారులకు తెలియజేయాలని చెప్పారు. ప్రతి ఏటా ఏదో ఒకచోట ఇలాంటి పరిస్థితి వస్తోందని రైతులు వాపోతున్నారు. అడవిపందుల దాడి నుంచి తమ పంటలను కాపాడాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినాఆ అటవీశాఖ అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి తమ పంటకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.



అడవిపందుల దాడిలో ధ్వంసమైన మొక్కజొన్న పంట

ఉపాధి పథకంలో రూ.కోటి దుర్వినియోగం

● గ్రామసభలు నిర్వహించకుండానే ఎలా తీర్మానం చేస్తారు?
● అధికారులను నిలదీసిన టీడీపీ నాయకులు

ఉరవకొండ,ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకంలో రూ.కోటి నిధులు దుర్వినియోగం అయినట్లు అధికారులు గుర్తించారు. వజ్రకరూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అడిషనల్ పీడీ సుధాకర్ రెడ్డి, ఎంపీడీవో రవిప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. 2023-24 సంవత్సరంలో ఉపాధి పథకం కింద 1,235 పనులకు గానూ రూ.11,75,87,703 ఖర్చు చేశారు. రూ.1.11కోట్లు దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. రూ.12లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ సిబ్బందికి రూ.లక్ష అపరాధ రుసుం విధించారు. గ్రామాల్లో గ్రామసభలు ఉన్నట్లు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు గోప్యంగా తీర్మానాలు చేయడమేమిటని టీడీపీ నాయకులు ప్రశ్నించారు. కొనకొండ్లలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సంబంధించి హౌసింగ్ బిల్లులు లబ్ధిదారులకు కాకుండా వేరే ఐడీ పేర్లలోకి డబ్బులు వేసుకుని కాజేశారని, గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మూడు వేల దాకా జాబ్‌కార్డులు ఉంటే కనీసం 1000మందికి కూడా పనులు కల్పించడం లేదన్నారు. జాబ్‌కార్డులు ఎంపీడీవో కార్యాలయంలోనే ఉన్నాయని, అధికారులు తెలిపారు. రాగులపాడులో కూలీల సంతకాలు లేకుండాబిల్లులు డ్రాచేసుకున్నట్లు గుర్తించారు. చెరువులో పూడికతీతపనులు చేయకుండానే రూ.3లక్షల నిధులు డ్రాచేశారని సీఆర్పీలు తెలిపారు. కొనకొండ్లలో మస్టర్లలో సంతకాలు లేకుండానే బిల్లులు డ్రా చేసినట్లు గుర్తించారు. లక్ష్మీకాంతాబాయి, టీడీపీ నాయకులు నూతేటి వెంకటేశులు, సుధాకర్, నాగేంద్ర, మండి ఎర్రిస్వామి, వన్నూరుస్వామి, శ్రీరాములు పాల్గొన్నారు.



అధికారులతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ నాయకులు

ఆధార్ కేంద్రాల వద్ద జనం పాట్లు



ఆధార్ సెంటర్ వద్దకు తల్లిని మోసుకొస్తున్న కుమారుడు

కుందుర్పి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆధార్ సేవల కోసం ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. మండలవ్యాప్తంగా రెండు ఆధార్ సెంటర్లు మాత్రమే పనిచేస్తుండటంతో ప్రజలు, విద్యార్థులు, రైతులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ షాపుల్లో ఈకేవైసీ, విద్యార్థులకు అపార్ ఆధార్, రైతు సేవ కేంద్రాల్లో రైతు సమగ్ర వివరణ నమోదు కోసం ఆధార్, ఫోన్ నెంబర్ లింక్ కోసం ఇలా అనేక సేవలు కోసం ప్రజలు ఆధార్ సెంటర్ల వద్ద గురువారం బారులు తీరారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో లక్ష్మీశంకర్ ఆధార్ నమోదు కోసం వచ్చే ప్రతి లబ్దిదారుడికి టోకెన్లు మంజూరు చేసి తేదీల వారిగా ఆధార్ నమోదు చేయాలని సూచించారు.

టీడీపీ కార్యకర్తలను విస్మరించరాదు

● వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రమేష్



మాట్లాడుతున్న వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వైపీ రమేష్

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం కష్టపడిన కార్యకర్తలను విస్మరించరాదని వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వైపీ రమేష్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద పోలింగ్ బూత్‌స్థాయి నాయకులతో సాధికారిక సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ ప్రతి పోలింగ్‌బూత్‌లో 60 మందికి ఇద్దరు సాధికార మిత్రలను ఎంపిక చేయాల్సి వుంటుందన్నారు. అందులో ఒకరు మహిళ, మరొకరు మగవారు ఉంటారన్నారు. ప్రతి కార్యకర్త ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఇప్పటికే అనేక రకాల నిధులు తీసుకురాబోతున్నారన్నారు. ఆ నిధులను మన కార్యకర్తలకు ఇచ్చి వారిని బలోపేతం చేసేవిధంగా కృషి చేస్తున్నారన్నారు. పట్టణ అధ్యక్షుడు గోళ్ల వెంకటేశులు, సర్మస్, డీకే రామాంజనేయులు, డిష్ మురళి, కొల్లాపురప్ప, అనిల్ చౌదరి, మార్కెట్ యార్డు చైర్మన్ లక్ష్మీదేవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రషర్‌ను మూసివేయండి

● తహసీల్దార్‌కు మలపనగుడి వాసుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మలపనగుడి గ్రామస్థులు

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మలపనగుడి గ్రామ సమీపంలో అక్రమంగా నిర్వహిస్తున్న క్వారీ క్రషర్‌ను మూసివేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. మండలంలోని మలపనగుడి గ్రామ సమీపంలో వైసీపీ మాజీ మండల కన్వీనర్ వన్నూరుస్వామి కొన్ని సంవత్సరాలుగా వైట్ స్టోన్ క్రషర్‌ను ఏర్పాటు చేశారు. సమీపంలోని కొండలో క్వారీని కూడా ఏర్పాటు చేసి బ్లాస్టింగ్‌ను నిర్వహిస్తున్నారు. క్రషర్ ద్వారా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. కొండలో బ్లాస్టింగ్‌తో ఇళ్ల గోడలు దెబ్బతింటున్నాయన్నారు. బోర్లలో నీటి శాతం పడిపోతోందని రైతులు వాపోతున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా క్రషర్‌పై ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. గురువారం తిరిగి ఈ క్రషర్‌ను నడిపేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ దుర్గేష్, ఉమేష్, తిమ్మప్ప, కృష్ణ, దుర్గన్న క్రషర్ వద్దకు వెళ్లి పనులను అడ్డుకున్నారు. అనంతరం రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్లి రాజుతో కలిసి గ్రామస్థులు తహసీల్దార్ మునివేలు, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

'మీ మాటే ముఖ్యం'కు నాలుగు ఫిర్యాదులు



అర్జీలు స్వీకరిస్తున్న ఏఎస్పీ

తాడిపత్రి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి ఆధ్వర్యంలో మీ మాటే ముఖ్యం అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రజలు పెద్దగా స్పందించకపోవడం గమనార్హం. నాలుగు ఫిర్యాదులు మాత్రమే వచ్చాయని పోలీసులు తెలిపారు. ఏఎస్పీ మాట్లాడుతూ నియోజకవర్గంలో అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడా జరగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా పేకాట, మట్కాపై ఇప్పటికే దాడులు నిర్వహించి నిందితులను అరెస్ట్‌చేశామన్నారు. గంజాయిపై ప్రత్యేక టీం ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా నియోజకవర్గవ్యాప్తంగా ప్రతి గ్రామానికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని అక్కడే పరిష్కరిస్తున్నామన్నారు. 15రోజులకు ఒకసారి ట్రబుల్‌మాంగర్స్, రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐ సాయిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కుందుర్పి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిగానపల్లిలో నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. కర్రే ఆధారం తెగితే ప్రమాదం అన్న శీర్షికను ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. విద్యుత్ అధికారులు స్పందించి గురువారం మండల పరిధిలోని కరిగానపల్లి గ్రామంలో నూతన స్తంభాన్ని ఏర్పాటు చేశారు.

హంద్రీనీవా కాలువ పరిశీలన

బెళుగుప్ప, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామసాగరం సమీపంలో గురువారం ఆర్డీవో వసంతబాబు హంద్రీనీవా కాలువను పరిశీలించారు. కాలువ నుంచి రిజర్వాయర్‌లోకి కృష్ణా జలాలు తరలివచ్చేందుకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రెగ్యులేటర్ 269 సర్వే నంబరులో గుట్టలు తొలగించాల్సి ఉంటుందని అధికారులకు తెలిపారు.

ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవంపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది

విడపనకల్లు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు పుష్పా, దంత వైద్యులు హరిప్రియ మాట్లాడుతూ నోరు ఎంత ఆరోగ్యంగా ఉంటే మనం కూడా అంత ఆరోగ్యంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

యాడికి: దంత సంరక్షణతో రోగాల బారి నుంచి కాపాడుకోవచ్చని ప్రభుత్వ దంత వైద్యురాలు ప్రశాంతి తెలిపారు. గురువారం యాడికిలోని హైస్కూల్‌లో దంత సంరక్షణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దంతాల సంరక్షణ ఎంతో అవసరమని తెలిపారు. డాక్టర్ పరమేశ్వర్, ప్రధానోపాధ్యాయుడు నాగన్న పాల్గొన్నారు.